# పెద్ద కథ



"మూడు రోజులనుండి ఇంటిని సర్దుతూనే ఉన్నావు కదే, సావిత్రీ? అబ్బాయి వచ్చే వేళకు కూడా సర్దుతూనే ఉంటావా?.... నీదో నీ తిక్క. అనవసరంగా ఒళ్లు అలిపించుకొంటున్నావు గాని—ఇది పల్లెటూరి ఇల్లు. ఎంత సవరించినా ఇంకా సర్దేదేదో ఉందనే అనిపిస్తుంది. పట్నవాసంలో ఉండి పెద్దపెద్ద వాళ్ళ ఇళ్ళలో పని చేశావేమో—అలాగే తయారు కావాలంటావు ఈ ఇల్లు!''

ముఖం చాటు చేసుకొని నవ్వింది సావిత్రి.

''ఇక చాలుగాని భోంచేసిరా పో. ఇంకేదైనా ఉంటే తరువాత సర్దవచ్చు గాని.''

"మీ అబ్బాయి వచ్చాక చేసూ కూర్చొంటే ఏం బాగుంటుందమ్మా?

పోల్కంపల్లి శాంతాదేవి

అయిపో వచ్చింది. కొంచెం పక్క బట్టలు, వీధి వసారాలో బాబాయ్‌గారు వాడుకొనే దిండుగలేబులూ మార్చాలి.'' ఇస్త్రీ గుడ్డలు తీయడానికి బల్లెవ్వరా తాళం చెవులు తీసుకొని వెళ్ళబోతుంటే కళ్యాణి అంది.

''రెండు మూడు రోజుల కోసం ఇంత ఆర్భాటం చేస్తున్నావు. రెణ్నెల్లు సెలవు పెట్టి అంత దూరం నుండి వాడొచ్చినా ఇక్కడ రెండు రోజుల కంటే నిలువలేడు. పట్నం వెళ్ళి స్నేహితులతో గడపడమే వాడు చేసే పని.''

సావిత్రి ఆగి అంది: ''అన్నీ మీరే చెబుతారు. ఇల్లు నీటుగా ఉండదని, ఇంత మంది నౌకర్లు చాకర్లు ఉన్నా ఇల్లు అస్తవ్యస్తంగా ఉంటుందని, పట్నవాసపు వాతావరణంతో విసిగి, ప్రశాంతంగా నాలుగు రోజులు పల్లెపట్టున గడిపి పోదామంటే నిమిషం నిలువ బుద్ధి కాదు— అని మీ అబ్బాయి అంటారని చెప్పారు. రెండు రోజులు ఉన్నా, రెండు నిమిషాలు ఉన్నా ఇల్లు నీటుగా, కంటికి ఆనందంగా ఉండడం అవసరమే. వచ్చి పోయేవాళ్ళ కోసం కాకపోయినా ఉన్నవాళ్ళకు ఇల్లు నీటుగా సర్దిపెట్టి ఉండడం అవసరం లేదా?''

జమీందారీ ఫాయిదాకు చెందిన కళ్యాణి వాళ్ళది చాలా గదులున్న పెద్ద మేడ. ఏ ఒక్కటీ కూడా అలంకారప్రాయంగా ఉండదు. ఏ గదిలో చూచినా అస్తవ్యస్తంగా వదిలి వేసిన సామగ్రి. ఓ మూల వానగొడ్లు, ఓ పక్క వేరుశెనక్కాయ, ఓ పక్క కొబ్బరికాయ, పైన గోడలకుండే చిలక్కొయ్యలకు ఎడ్ల తలుగులో, ఈతనారో ఏదో ఒకటి అసహ్యంగా వ్రేళ్ళాడుతూంటాయి. ఇంటి నిండా ధాన్యపు కుప్పలేమోగాని శుభ్రత అన్నది పోయింది. దొరసాని పిల్లల్ని కనడంలో బలహీనమై ఇంటి పని అంటే బొత్తిగా ఓపలేనిదై పోయింది. పని వాళ్ళతో చెప్పి చేయించే నేర్పు అసలే లేదు. అందుకే ఏ గది చూచినా ఇరకాటమై అసహ్యంగా కనబడుతూంటుంది.

ఏడాది క్రింద రాజమ్మణ్ణి ద్వారా ఇక్కడ పనిలో కుదిరిన సావిత్రికి పైపై పనులతోటే పొద్దు గ్రుంకి పోతుంటే ఇల్లు సర్దితే బాగుంటుందన్న ఊహ ఎప్పుడూ రాలేదు.

మూడు రోజుల క్రితం పెద్దకొడుకు హరనాథ్ నుండి రెణ్ణెల్లు సెలవు పెట్టి వస్తానంటూ ఉత్తరం వచ్చింది. కళ్యాణి అప్పుడప్పుడూ చెప్పే మాటలను బట్టి, అతడి స్వభావమే గాక స్వరూపం కూడా ఊహించుకో గలుగుతూంది సావిత్రి. పాతికేళ్ళ కోడెవయసు. తండ్రి కంటే ఓ బెత్తెడు ఎత్తుగా ఉంటాడంటే బాగా ఎత్తైన విగ్రహమే ఉంటుంది. అంతా వాడిది తండ్రి పోలికేనంటుంది తల్లి.

వయసు ఏభయ్యో పడిలో పడినా ఉమాపతి రావులో ఆడవాళ్ళను అమితంగా ఆకర్షించే హుందాతనం ఇప్పటికీ కొట్టవచ్చినట్టు అగుపడుతూంటుంది. ఆ పోలికలో పాతి కేళ్ళ యువకుడు ఆడవాళ్ళను ఎంతైనా వెర్రివాళ్ళను చేయవచ్చు. ఇదివరకు రెండు మూడు పెళ్ళిచూపులు కూడా జరిగి పిల్ల నచ్చలేదని నిరాకరించాడంటే అతడెంత మన్మథుడో?

ఎత్తవలసినవి గాదెలకూ గంపలకూ ఎత్తి, ఎన్నాళ్ళగానో స్వేచ్ఛనేర్పరచు కొన్న పందికొక్కుల నివాసాలను పూడ్చి, శుభ్రంగా చెత్తా చెదారం ఊడ్చి ఇక్కడివి అక్కడా అక్కడివి ఇక్కడా తీసి పెట్టి—ఇంటిని అందంగా, ఆకర్షణీయంగా మార్చి వేసింది సావిత్రి ఈ మూడు రోజుల నుండి.

అనవసరంగా అలిసి పోతున్నావని విసుక్కొంటున్నా ఓ పక్క మెచ్చు కొంటూనే ఉంది కళ్యాణి. "కొత్తకొత్త సామాన్లు లేకపోయినా ఉన్నవి ఉండ వలసిన చోట ఉంచితే ఎంత అందం వస్తుందో ఇంటికి—చేసి చూపించావే, సావిత్రీ!"

దిండు గలేబులు తీసుకొని అవతలికి వెళ్ళింది సావిత్రి.

అరుగు మీద పరచిన లివాసీ మీద గోడవార దిండ్ల మీద చేరబడి రైతులతో వ్యవసాయానికి సంబంధించిన సంగతు లేవో చర్చిస్తున్నారు రావుగారు. ఆయన లేచేవరకు ఆగాలంటే పట్నం దొరగారు దిగబడతారేమో!

"బాబాయ్, మీరు కొంచెం జరుగు తారా! గలేబులు మార్చి వెడతాను."

సావిత్రి భోజనానికి వెళ్ళేప్పటికి మధ్యాహ్నం రెండు దాటిపోయింది.

## 2

వెనుక నౌకరు సూటుకేసు పట్టుకు వస్తూంటే ఫుల్‌సూట్‌లో నిండుగా రెండు సంవత్సరాల తరువాత గడపలో అడుగు పెడుతూన్న పెద్దకొడుకును మమ తగా చూస్తూ, "బాగున్నావురా, హరీ? ఎంత పెద్ద ఉద్యోగమైనా రెండేళ్ళా ఇంటి ముఖం చూడకుండా పోవడం?" అంది కళ్యాణి.

"...................." మౌనంగా చిరునవ్వు నవ్వి చేతులో ఉన్న లెదర్ కేసు తెరిచి చాక్‌లెట్లు తీసిచ్చాడు చెల్లెలికీ, తమ్ముడికీ—హరనాథ్.

"వెళ్ళు, వెళ్ళు! ఈసారి ముక్కుకు తాడు వేసిగాని పంపను."

"...................." తిరిగి చిరు నవ్వే సమాధానమైంది. మరొక్కసారి అందరి క్షేమ సమాచారాలు విచారించి పైకి వెళ్ళబోతూ "నా గది తాళం చేతు లిటివ్వమ్మా!" అన్నాడు హరనాథ్.

"సావిత్రీ!" అంటూ హడావిడిగా

వెడుతూన్న తల్లిని విస్మయంగా చూస్తూ చెవులు రిక్కించాడు.

"పైన గది తాళం చేతులేవీ?"

"ఇదుగో నమ్మా....వచ్చాడా మీ అబ్బాయి?" మృదువుగా, సొంపుగా ఉందా కంఠం.

"ఎవరీ సావిత్రి కొత్తగా!" తల్లి అందిస్తూన్న తాళం చెవి అందుకొంటూ ఆవిడ ముఖంలోకి చూచాడు గాని, అతడి సందేహం గుర్తించకుండా మొదటికంటే హడావిడిగా వెళ్ళిపోయింది—"ఫలహారానికి ఆలూబొండా చెయ్యమని సావిత్రికి చెప్పాలి" అంటూ.

"కొత్తగా వంటకు కుదిరిన మనిషా? ఇదివరకు చేస్తున్న రాజమ్మణ్ణి వెళ్ళిపోయి ఉంటుందా? రాజవ్వ అప్పటికే ముసలిదై పోయింది కదా—బిడ్డ దగ్గరికి వెళ్ళిపోయో, చచ్చిపోయో ఉంటుంది!"

గొంతును బట్టి పడుచు పిల్లగా చక్కని చుక్కగానే ఊహించుకోవచ్చు. ఈ వయసులో వంటకు కుదిరిందంటే బహుశః వితంతువు అయిఉంటుంది.

"చూడాలి. నా ఊహ లెంతవరకు నిజమౌతాయో!" కుతూహలంగా అను కొంటూ గదితలుపులు తెరిచాడు హరనాథ్. గది ఇదివరకటిలా లేదు. అత డెప్పుడు వచ్చినా తల్లి శుభ్రంగా ఊడ్పించి ఉంచేది కాని. ఏ వస్తువూ ఉన్నచోటునుండి కదిలించబడేది కాదు. ఇప్పు డంతా మార్చివేయబడింది.

కిటికీ దగ్గర టేబిల్ మీద చక్కగా పువ్వుల డిజైను కుట్టి, అప్పుడే ఇస్త్రీ నుండి తీసినట్టున్న టేబిల్ క్లాత్, ఆ పైన ఏవో రెండు వీక్లీలు, పక్కకు విలక్షణంగా తుడిచిఉంచిన అద్దం ముందు బ్రష్షులో నల్లటి దువ్వెనా - ఇటు పక్క పట్టెమంచం, మీద తెల్లటి దుప్పటిపరిచిన మెత్తటిపరుపు-ఎవరిచేతి నాణ్యమో గాని తనకు నచ్చినట్టుగా ఉందా గది. రైలు ప్రయాణంలో అలసినమేను ఒక్కసారి మెత్తటి పానుపు మీద వాల్చాలని పించింది.

దుస్తులు మార్చి తుండూ సబ్బుపెట్టె తీసుకొని క్రిందికి వెళ్ళాడు హరనాథ్. స్నానం చేసివచ్చేప్పుడు, పోయేప్పుడూ కూడా ఆమె కనబడుతుందేమోనని చూచాడు గాని-కనపడలేదు.

---

"మీరు నూరేళ్ళు బతకగలిగినందుకు ముఖ్యమైన కారణం చెపుతారా?" అన్నాడు పత్రికా విలేఖరి.

"నేను 1871 లో పుట్టి ఉండటమే ముఖ్యమైన కారణం!" అన్నాడు శత వృద్ధు.



"హరీ!" నిద్రనుండి లేచివచ్చారు ఉమాపతిరావుగారు. "ప్రయాణం కులాసాగానే జరిగిందా?"

"ఆఁ "

"వెళ్ళి కాస్సేపు విశ్రాంతి తీసుకో తరువాత మాట్లాడుకొందాం."

పైకివచ్చి ఇస్త్రీ పంచె షర్ట్ తీసి వేసుకున్నాడు ఏం చేస్తున్నా అతడి చూపులన్నీ మెట్లవైపుగానే ఉన్నాయి

తమ్ముడుగాని, చెల్లెలుగాని వస్తే సావిత్రి గురించి అడగాలని. ఎవరూ రాలేదు అరగంటదాకా!

సూట్ కేస్‌లోంచి ట్రాన్సిస్టరు తీసి ట్యూన్ చేసి, ఎక్కడినుండో మళయాళం ఫిల్మ్ సంగీతం ప్రసారమౌతూంటే టేబిల్‌మీద ఉంచేసి వచ్చి పక్కమీద వాలాడు. ట్రెయిన్‌లో కాలక్షేపానికి కొన్న ఇంగ్లీషు మాగజైను తిప్పేస్తూ.

"ఫలహారం తీసుకోండి."

చటుక్కున ముఖంముందు నుండి పత్రిక తొలగించి మెడతిప్పి చూచాడు హరనాధ్.

అప్పటికే ఆమె వెనుదిరిగింది. దీర్ఘమైన జడ పిరుదులమీద నర్తిస్తూంటే చకచకా నడిచి వెళ్ళిపోయింది. రెవికకూ, చీరకట్టుకూ మధ్య బెత్తెడు శరీరం తెల్లగా, అరటిరిబ్బలా మెరుస్తూంటే. గుండ్రంగా ఉన్న భుజాలమీద కోలగా ఉన్న మెడ చిన్నగా, అందంగా కదులుతూంటే, షుమారైన ఎత్తుతో-' నాఊహ అబద్ధం కాదు. తలుచుకొంటే మంచి డిటెక్టివ్‌ను కూడా కాగలనేమో అనుకొన్నాడు కొంచెం గర్వంగా,

టిఫిన్‌లు, టీలు ఉన్నచోటికి తెచ్చి అందివ్వడం కొత్త పద్ధతి. రాజమ్మణ్ణి కాలంలో ఎవరికి ఏది కావాలన్నా వంటింట్లోకి వెళ్ళవలసిందే. హరనాధ్ పుట్టక ముందునుండీ ఉంటూన్న వంటమనిషి రాజమ్మణ్ణి. అంతా వెనుకటి తరహా. వయసు తగ్గిపోతుంటే ఓపలేనితనం. చేతగానితనం చోటు చేసుకొన్నాయి ఆవిడలో. ఏదో వెనుకటినుండి తమలో కలసిపోయిన మనిషి అని ఆవిడ పెట్టిందేదో తిని బయట పడడమే గాని ఆమెను పనినుండి మాన్పించి మరో చురుకైన మనిషిని పెట్టుకోవాలన్న ఆలోచన రాలే దెవరికీ.

శంఖును మలిచినట్టున్న చెయ్యి టీ కప్పుతో టేబిల్ మీదికి వచ్చింది ప్రక్కనుండి. తెల్లటి తెలుపును ఎత్తిచూపుతున్నట్టుగా చేతికి రెండు నల్లకాపీలు.

ఆసక్తిగా చటుక్కుని ముఖం తిప్పి చూచాడు హరనాధ్.


"నీలకాంతా!" దిగ్భ్రమగా పిలిచాడు,

సావిత్రి ఇటు ఒకక్షణం శ్రద్ధగా చూచి ముఖం తిప్పుకొని వెళ్ళబోతూ మందంగా అంది: "నా పేరు సావిత్రి నీలకాంత కాదు."

చివాలున లేచి ఆమెను పట్టుకోబోతే చేతికి అందింది నిడుపాటి జడ. "ఏమిటీ నాటకం? ఇక్కడి కెలా వచ్చావు?"

అతడి ముఖంలోకి చురుగ్గా చూచి. కఠినంగా అంది: "ఏమిటిది? వదలండి. నా పేరు సావిత్రి. కళ్ళకు పైత్యం చుట్టుకొందేమో శొంఠిపొడి తెచ్చిపెడతానుండండి!

ఆమె భుజాలుపట్టుకొని ఉద్వేగంతో




గద్దించాడు. "నిజం చెప్పు. అతడు వది లేసిపోతే బ్రతుకు తెరువుకోసం వచ్చావా ఇక్కడికి!"

"........"అర్థంకానట్టు చూచింది.

అసహనంగా అరిచాడు, "పేరు మార్చుకొన్నంత మాత్రాన మనిషివి మారలేవు. ఒకేఒక్కసారి కొద్దిక్షణాలే చూచాననుకో. అయినా నీ ముఖంలో ప్రత్యేకాకర్షణ అందంగా వంగిన ఒత్తయిన ఆ కనుబొమల కలయిక ఎన్ని జన్మలకూ మరిచిపోలేను. చెప్పు! నిజం చెప్పు! మీ అమ్మకు కబురుచేస్తే నువ్వెవరినో తీసుకొనిలేచిపోయావని తెలిసింది."

"మీరు ఎవరి సంగతో మాట్లాడుతున్నారు. రాజవ్వ ఇక్కడ కుదిర్చింది నన్ను. నా పేరు సావిత్రి. శాంతంగా స్థిరంగా అని ఒక్కఊపులో విదిలించేసి కొని మెట్లకేసి పరుగుతీసింది సావిత్రి.

'నీ తెలివితేటలు నా దగ్గర సాగవు. నువ్వెవరివో తేల్చకపోను...." ధీమాగా చేతిలోకి కప్పు తీసుకొన్నాడు హరనాథ్.

నీడలు దీర్ఘ మౌతుంటే కిరణాలలో వాడి తగ్గించుకొంటూ పశ్చిమ దిక్కుగా ఒరిగిపోతున్నాడు సూర్యభగవానుడు తరాలనాటి అడవిమొల్లక్రింద అంతలావు బుదం కట్టుకొని పైకి ఎగబ్రాకి వచ్చి

కిటికీలోంచి తొంగిచూస్తూంది. నిండా మల్లెమొగ్గలు కొద్దిసేపటిలో విచ్చుకోడానికి తెల్లగా పండుబారాయి.

కిటికీ పక్కగా నిలబడి దూరంగా కనుపించే వీలాంకేసి చూపులుపోనిచ్చాడు హరనాద్. ఇంకా వర్షరుతువు ప్రారంభం కాలేదు. మోటబావుల క్రింద కొద్ది కొద్దిగా వరిపైరు పెంచారు. మండు వేసవిలో ఎక్కడ ఏ చిన్న మొక్క చూచి నా ప్రాణం లేచివస్తుంది.

క్రింద సావిత్రి గొంతు వినిపించి ఊచల దగ్గరగా ముఖంచేర్చి క్రిందికి తొంగిచూడ సాగాడు హరనాద్. చిన్నవాడికి గుడ్డలువిప్పి స్నానాల గదికేసి తీసుకుపోతూంది సావిత్రి. "ఎన్నిసార్లు చెప్పాలబ్బా నీకు చినబాబూ? గుడ్డలువేసి అరగంటయినా కాలేదు. అప్పుడే మట్టిలో దొర్లావు" అంది మందలింపుగా. "పట్నంనుండి మీ అన్నయ్య వచ్చాడే? నువ్విలా మట్టిలో ఆడి అసహ్యంగా తయారయ్యావంటే చాక్లెట్లు ఇవ్వడట. ఎంచక్కా మల్లెపువ్వులా శుభ్రంగా ఉండాలి. అలా ఉంటే బోల్డు చాక్లెట్లు ఇస్తాడట మీ అన్నయ్య."

"ఓః ఈ ఇంట్లో పొందికగా కుదురుకుపోయినట్లుంది సావిత్రి—కాదు, నీలకాంతః"

అలా నిలబడి చూస్తుండగానే చిన్న కూతుర్ని నెమ్మదిగా మెట్లు ఎక్కిస్తూ వచ్చింది కళ్యాణి. కుర్చీ లాక్కొని కూర్చొంది. ఆ సంగతీ ఈ సంగతీ అడుగుతూ. "నెల్లాళ్ళ క్రింద మీ నాన్నగారు వ్రాసిన దానికి జవాబు యివ్వలేదెందుకు?"

"రెండేళ్ళనాడే చెప్పేశాను కదా, ఆ పిల్ల నచ్చలేదని? ఇన్నాళ్ళూ నా కోసం ఎవరు కాచుక్కూర్చోమన్నారు ఆ పిల్ల తండ్రిని?"

"అన్నివిధాలా నువ్వు కోరుకొన్నట్టే పిల్ల ఎక్కడ దొరకాలిరా? ఏదో ఒక లోపం లేనిపిల్ల ఎక్కడుంటుంది? నాకేమో ఆ పిల్ల బాగా ఉంటుందనిపిస్తుంది.... అందుకే పూర్తిగా, ఖచ్చితంగా అక్కర్లేదని చెప్పలేదు వాళ్ళకు ఆనాడూ ఈనాడూ కూడా. అదీ ఇదీ చెప్పి నానుస్తూ ఉన్నాం."

"ఏం? ఎందుకు ఉండకూడదూ అని? ఏ విధాలా నేను కోరుకొన్నట్టి పిల్ల? మనింట్లో లేదూ సావిత్రి? ఆవిడకేమైంది?"

కొడుకు చిరునవ్వు చూచి ముందు

---

మిలిటరీలో పని చేసినవాణ్ణి పెళ్లాడిన స్త్రీ సుఖపడుతుంది. ఎందుకంటే - అతను వంటా వార్పూ తెలిసినవాడు; శయ్యలు అమర్చగలడు; కుట్టుపని చేయగలడు; అన్నిటినీ మించి పై అధికారులనుంచి ఆజ్ఞలు తీసుకునేందుకు అలవడిన వాడూను;

కంగారు పడ్డా నిదానంగా సర్దుకొంది కళ్యాణి. "ఎవరో ఎక్కడో ఉంటే ఏం లాభం? మనకు అందుబాటులో ఉండొద్దూ పిల్ల!"

"రాజవ్వ కనిపించడం లేదేం?"

"చెప్పడమే మరిచాను. రాజవ్వ పోయిందిరా. కూతురిదగ్గరికి వెళ్ళి అక్కడే చనిపోయింది. రాజవ్వ తీసుకు వచ్చింది ఈ సావిత్రిని రాజవ్వకు దూరపు బంధువుల పిల్లట. తల్లి ఈ మధ్యే చనిపోతే ఒంటరిదైన ఈ పిల్లను తీసుకువచ్చింది ఇక్కడికి మెరికలాంటి పిల్లరా. బొంగరంలా చేసుకువస్తుంది పని. ఆ పని ఈ పని అని ఏం లేదు. అన్నిపనులూ చక్కదిద్దుకువస్తూంది నిమిషంలో ... పండుగైనా ప్రయోజనమైనా ఉండాలి ఇలాంటి పిల్ల!"

"బ్రాహ్మణ పిల్లేనా?"

"అదేమిట్రా? రాజవ్వకు వరుసకు కూతురు అవుతుందట."

"తను పొరబడలేదు కదా?" అటు ఇటు ఊగింది మనసు. తల్లి ఎంత నౌకర్ల మీద ఆధారపడినా ఇంకా అనాచారానికి లోబడలేదు. తండ్రి సంధ్యావందనం దేవతార్చన లేనిదే నోట్లో నీళ్లు పోయడు. అలాంటి శుద్ధ బ్రాహ్మణుల కుటుంబంలో చేరి వాళ్ల ఆచారనిష్ఠల్ని మంటగలపగల సాహసం ఎక్కడిది ఈ సావిత్రికి? బ్రాహ్మలపిల్ల కాదది-వేశ్య యువతి అని చెబితే ఏమౌతారు వీళ్లు?

"ఏ మాలోచిస్తున్నావు, హరీ, నా కా పిల్ల తప్పిపోతే అంతపాటి సంబంధం దొరకదనిపిస్తుంది."

"పోనియ్యి. ఇప్పు డేమంత వయసు ముదిరిపోతుందని?"

"పాతికేళ్ళు పైబడ్డాయి. ఇంకా వయసు ముదరడ మేమిట్రా? నువ్విలాగే కాదు కాదంటూంటావు. ఇహ నీ మాట పట్టుకు కూర్చోదలచలేదు. వాళ్ళకు కబురు పెట్టిస్తాను రమ్మని."

"వద్దమ్మా." నిదానంగా, స్థిమితంగా అన్నాడు, "వాళ్ళకు మరో సంబంధం చూచుకొమ్మని చెప్పు."

ఇంకాఅక్కడేఉంటే తల్లి మరే ఉచ్చు మెడకు విసురుతుందోనని బట్టలు వేసుకొని "అలా తోటకేసివెళ్ళివస్తా" నంటూ బయల్దేరాడు.

తిరిగి తిరిగి భోజనాల వేళకు ఇంటికి వచ్చాడు హరినాథ్.

అప్పటికే రావుగారు భోజనం ముగించుకు వెళ్ళిపోయారు.

తల్లీ కొడుకులకు పక్కపక్కనే పీటలు వేసి వడ్డించింది సావిత్రి.

భోజనం మధ్యలో అణకువగా అడిగింది సావిత్రి: 'పప్పు వడ్డించనాఅండీ? బెండకాయ పులికూడా ఉంది."




అమెకు బదులు చెప్పకుండా తల్లి దిక్కు తిరిగాడు హరనాథ్. "ఇంట్లో నీవిద్దరు కుర్రాళ్ళను పెట్టుకొని ఈ వడుచు పిల్లను వంటకు పెట్టుకోవడం క్షేమమే అంటావా అమ్మా? కొంచెం వయసు మళ్ళుతున్నవాళ్ళు ఎవరూ దొరకలేదూ?"

"ఇదేమిటి? ఈపిల్లాడు ఇలామాట్లాడు తున్నాడు ఆ పిల్లముందే?" తెల్లబోయిన కళ్యాణి సావిత్రి నొచ్చుకొందేమోనని సానుభూతిపూర్వకంగా చూచింది కాని, ఏ భావమూ వ్యక్తపరుచని చిత్తరువులా నిలబడింది సావిత్రి.

"పప్పు తీసుకురా." తన మాటకు సిగ్గుతో చితికిపోతుందే కసిగా నవ్వుకోవా లన్న హరనాథ్‌కు చెంపదెబ్బలా తోచింది సావిత్రి నిశ్శబ్ద ప్రవర్తన.

"సావిత్రి అంటే మామూలు పిల్ల కాదురా. మరోసారి అలాంటి మాటలు అనబోకు!" మందలించింది కళ్యాణి.

"అంత నమ్మకముంటే ఫర్వాలేదు

కంచంలో చెయి కడుక్కొని వెళ్ళి పోతూ, "ఓ గంటతరువాత కొంచెం వేడిగా ఉండేపాలు ఓ గ్లాసుడు తెచ్చివ్వు మందువేసుకొని తాగాలి" అంటూ, ఓ మామూలు పనిమనిషికి చెప్పినట్టు చెప్పాడు.

"వాడు తమాషాగా మాట్లాడు

తున్నాడు. నువ్వేం పట్టించుకొని బాధ పడకు.''

చాలా అమాయకురాలైన అమ్మా యిలా తలూంపిది సావిత్రి.

సావిత్రి భోజనమయ్యి వంటిల్లంతా కడిగివేసి శుభ్రపరుచుకొనేటప్పటికి రాత్రి పదిగంట లైంది. బాగా కాగినపాలు గ్లాసులో పోసుకొని మిగిలినపాలలో తోడు పెట్టి కుండ ఉట్టిమీద పడేసి వంటింటి తలుపులు వేసేసి ఇవతలికి వచ్చింది. హాలులో అప్పటికే కళ్యాణి చిన్నకూతు రిని పక్కలో వేసుకొని నిద్రలో మునిగి పోయింది. ఆ పక్క మంచంమీద రావు గారు కూడా నిద్రలో ఉన్నారు.

నెమ్మదిగా మెట్లెక్కి హరనాథ్ గదిలో అడుగుపెట్టింది సావిత్రి.

పరుపుమీద అటు తిరిగి పడుకొన్నాడు హరనాథ్. దీర్ఘంగా చూచిం దొక్క క్షణం. తెల్లటి పరుపుమీద తెల్లటి బట్టలు ధరించిన బలిష్ట విగ్రహం! తల్లిపొగడ్తకు రెండింతలు అందగాడు. కాని ఎందుకింత అహంకారమితడికి? ''పడుకొన్నారా అండీ?.... పాలు తెచ్చాను." గ్లాసు బల్ల మీద పెట్టి అద్దంతీసి మూతపెట్టింది.

''........''

''పాలు తెచ్చానండీ.'' ఈ సారి కొంచెం గట్టిగా చెప్పింది,

మెలుకువ కలిగినట్టు నటిస్తూ ఇటు తిరిగాడు. ''అర్ధరాత్రికి తెస్తే అందరూ పడుకొని ఉంటారనా?''

''మీ రేదో చిత్తభ్రమలో ఉన్నారు. అర్ధరాత్రి కాలేదు; లేచి గడియారంచూచు కోండి. పది అయింది. నా భోజనంకూడా అయింది.'' విసురుగా వెళ్ళబోతూఅంది.

''మందులోకి కావాలన్నారు?''

''నీ మొహంలోకి కావాలన్నాను.'' లేచి, అంతవేడిగా లేని గ్లాసుడుపాలు గటగటా తాగేసి రెండు మెట్లు దిగిన సావిత్రిని వెనక్కి పిలిచాడు. ''ఏయ్, వంటలక్కా! గ్లాస్ తీసుకుపో."

తిరిగివచ్చి గ్లాసు అందుకొంది. "ఒక్కవంటే కాదండీ, మీ ఇంట్లోఅన్ని పనులూ చక్కబెడుతుంటాను.''

రెండు మెట్లు దిగిన ఆమెను మళ్ళీ వెనక్కి పిలిచాడు. ''ఓ దాసీ.''

సావిత్రి పూర్తిగా లోపలికి రాకుండా గడపదగ్గర నిలబడి ''ఏం కావాలండీ!'' అని అడిగింది సాధ్యమైనంత నిదానంతో.

"బయట ఎంతగాలి ఉన్నా లోపల ఉక్కపోత భరించరాకుండా ఉంది పక్క అవతలవేసి వెళ్ళు.''

''గాలి ముమ్మరంగా ఉంది అవతల. దుమ్ము ఎత్తిపోస్తూంది.''

''ఫర్వాలేదు. ఈ ఉక్కపోత కంటే అదే మేలు.''

''మీ ఇష్టమైతే." గ్లాసు టేబుల్ మీద

ఉంచి పరుపు చుట్టబోయింది. వెనుక నుండి బలిష్ఠంగా రెండుచేతులు భుజాలను బిగదీశాయి. ఎంత పొగరుమనిషిలా కనబడుతున్నా ఇంత అమర్యాదకూ, అసభ్యతకూ సాహసిస్తాడనుకోలేదు సావిత్రి. విదిలించిపారేయాలనుకొంది. ఆమె ప్రయత్నం కబంధహస్తంలో చిక్కిన చిన్న పిట్ట రెక్కలాడించబోయినట్టే అయింది. "అబ్బా! మగవాడి భుజంలో ఇంతబల ముంటుందా?" ఈ తరుణంలో తనేమాత్రం పారిపోవాలని ప్రయత్నించినా అతడి పురుషత్వాన్ని రెచ్చగొట్టి అవమానానికి లోబడవలసి వస్తుందనిపించి అచైతన్యంగా ఆగిపోయి స్థిరంగా. గంభీరంగా అతడి ముఖంలోకి చూచింది. ఆమె భయపడినంతగా అతడి ముఖంలో ఉద్వేగంగానీ, ఆకలిగొన్న చూపులుగానీ లేవు. సన్నని మీసకట్టు క్రింద చిన్నగా ఉన్నా మోటుగా కనిపించే పెదవులమీద ఓ చిన్న కొంటెనవ్వు తప్ప.

"ఏమిటి ఉద్దేశ్యం?" తొలకరి ఉరుములా వినిపించింది. వైశాఖంలో ఎండ కాస్తూనే ఉంటుంది. పైన ఆకాశంలో దూదిపింజల్లా తెల్లటి మేఘాలు తేలిపోతూనే ఉంటాయి. గడగడా ఏక్కడినుంచో ఉరుము అదరగొడుతుంది. అతి శాంతంగా ఉన్న ఆమె మొఖంలోంచి వచ్చిన ప్రశ్నరు నిగ్గదీస్తూ ఎదురు ప్రశ్న వేశాడు: "ఇక్కడ ఈ వేషం కట్టడంలో నీ ఉద్దేశ్యం ఏమిటి?"

"అబ్బబ్బ! ఎన్నిసార్లు చెప్పాలండీ? నేను నీలకాంతను కాదు. నా పేరు సావిత్రి. ఇంకా మీరువినకపోతే పొద్దున్నే చాటించేస్తాను—హరనాధబాబుగారు ఎవరో నీలకాంత అనే అమ్మాయిని ప్రేమించారట. అది ఎవణ్నో తీసుకొని లేచిపోతే మతి చలించి-పిచ్చెక్కి ఆ వయసులో ఉన్న అమ్మాయిల వెంట 'నీలకాంత నీలకాంత' అంటూ పడుతూ పట్టుకొంటున్నాడని." గంభీరంగా అనబోయినా నవ్వు పెదవుల బిగిని సడలిస్తూంది.

"నీలకాంతను నేను ప్రేమించానని ఎప్పుడన్నాను?"

"మరి, ఇదేంపిచ్చి?"

"అయితే నన్ను బాగా చూడనీ!" రెండుచేతుల్లోకి ఆమె ముఖం తీసుకొని గాఢంగా చూచాడు. చూపులు ముఖం చుట్టూ తిరిగితిరిగి అందంగా వంగిన కనుబొమ్మల్ని సన్నని వెంట్రుకలు గీతలా కలుపుతున్నచోట ఆగిపోయాయి. హఠాత్తుగా ఆ నాటి నీలకాంత అక్కడ సాక్షాత్కరించింది. ఆ వెంటనే ఆమెను కలుసుకున్న సంఘటనా గుర్తువచ్చింది.

[సశేషం]

# పెద్దకథ



(గత సంచిక తరువాయి)

ఎమ్. ఎస్సి. పరీక్షలయ్యి ఇంటికి వచ్చాక ఎనిమిది రోజులకే కాలక్షేపం కాక విసిగెత్తి పట్నం వచ్చేశాడు తిరిగి హరనాద్.

ఉదయంనుండి మబ్బుపట్టి చల్లగా, హాయిగా ఉంది వాతావరణం. ఏవో వెర్రి కోరికలు పుడుతున్నాయి. రూమ్‌లో పాతుకుపోయి దినం వ్యర్థపరుచ కూడదనిపిస్తూంది.

"ఈరోజు ఖుషీగా గడపాలనుందిరా! ఏంచేద్దామంటావు?" అన్నాడు రూంమేటు మురళీధర్‌తో.

"ఖుషీ అంటే?"

"ఫ్రెండ్స్‌నుపిలిచి పార్టీచేసుకొందాం. చక్కగా కబుర్లతో, పేకాటతో గడిపేద్దాం. నైట్‌కు పిక్చర్."

"చచ్చు కోరిక; చవట కోరిక! తీసిపారేశాడు మురళి. "చల్లగా మబ్బుపట్టింది, వయసు కుర్రాడివి. పార్టీలతో,

పిక్చర్లతో దొరికేది ఏ పాటి వినోద ఉత్సాహ మిస్తుందోయ్? నీకు నిజంగా ఖుషీగా గడపాలనుంటే నాతో రా.''

అర్థమైంది అతడి నవ్వుతో. ''సై'' అన్నాడు డ్రెస్ చేసుకోడానికి లేస్తూ. చూడబోతే నీకు అలవాటు ఉన్నట్లుందే?''

''ఏదో అప్పుడప్పుడు. వంట్లో తిక్క రేగినప్పుడు.''

మనసులో బెరుగ్గా ఉన్నా ఏదో కుతూహలం మురళిలో ఈడ్చుకుపోతూంది. కొన్ని వీధులు తిరిగి ఓ రెండు అంతస్తుల మురళి భుజం తట్టి వెకిలిగా నవ్వింది ఓ చిలుక.

''మిత్రుడే,'' సిగ్గు, సంకోచం ఏవీ లేకుండా ఓ కుర్చీ ఆక్రమించుకొని కూర్చున్నాడు మురళి. ''వాడు ఇలాంటి చోట్లకు కొత్త. హృదయంలో హత్తుకు పోయేట్టుండాలి ఈ దినం. వాణీ ఏదీ? పిలువూ ఓ పాట పాడనీ.''

గానాబజానా సాగుతూంటే అనహనంగా కుర్చీలో మెదలసాగాడు హరనాథ్. ''ఏకాంతంలో ఒక అందమైనఅమ్మాయి

## పోల్కంపల్లి శాంతాదేవి

మేడముందు ఆగాడు మురళి. ''అనాథ శరణాలయం'' బోర్డు చూచి అసహనం ప్రకటించగా హరనాథ్. ''ఇక్కడేం దొరుకుతుంది ఖుషీ?''

''లోపలికి పదవోయ్. ఇక్కడుండేది అనాథలు కాదు. అందకత్తెలు. పైన బోర్డు కేవలం సేఫ్టీ కోసం.''

ఎన్నడూ అంతమంది ఆడవాళ్ళలోకి పోలేదేమో - కళ్ళు చెదిరిపోయాయి హరనాథ్‌కు. రంగు రంగుల్లో రెపరెపలాడే సీతాకోక చిలకల్లా కులికేవాళ్ళను చూచి.

''మీ మిత్రుడా?'' అనవసరంగా అయితే చాలు!'' అందరినీ పరిశీలనగా చూశాడు. వేషాలయితే ఆకర్షణీయంగా వేసుకొన్నారు గాని. సహజ సౌందర్యం ఎవరిలోనూ కనిపించలేదు విసుగ్గా వెళ్ళిపోవడానికి లేచాడు.

వీధిలో కారాగిన శబ్దం వినిపించింది. రెండు నిమిషాల్లో కళ్ళద్దాలు ధరించి, చేతికి రిస్ట్‌వాచికట్టి పట్టుచీరలో హుందాగా ప్రవేశించిందొక ప్రౌఢవనిత.

''ఈ శృంగారసీమ వీరి ఆధ్వర్యంలోనే నడుపబడుతూంది. పేరు ప్రియం

వద.'' మెల్లగా మిత్రుడి భుజం తట్టి చెప్పాడు మురళి.

వస్తూనే ఆవిడ చూపులు కలిగినింటి బిడలా అగుపడుతున్న హరనాథ్ మీద పడ్డాయి.

"వీ రెవరు?''

మురళి మిత్రుడిని పరిచయంచేశాడు. లక్ష్మి పుత్రుడని తెలిసి ముఖం చాటంత చేసుకొంది. హరనాథ్ పాదాల నుండి శిరసుదాకా చేయి విసిరి ''ఈ మహారాజుకు ఈ దిష్టి బొమ్మలేం తగుతాయి? తగుతే తగాలి - మా అమ్మాయి నీలకాంతే తగాలి!'' అంది.

పెదవులు తడుపుకొన్నాడు మురళి. ''మీ కో కూతురుందని ఇప్పుడు తెలిసింది నాకు,'' బహుశః పెద్ద రేటులో ఉండి తనబోటివారి కంట బడలేదేమో అనుకున్నాడు.

ప్రియంవదను ఎగాదిగా చూచి జుగుప్సగా నవ్వుకొన్నాడు హరనాథ్. 'నువ్వో హిడింబిలా ఉన్నావు. నీ కూతురో చిన్న హిడింబిలా ఉంటుందేమో!....

"బి. ఎ. పరీక్ష వచ్చింది. ఈ కాలం కుర్రాళ్ళు చదువుకొన్న ఆడపిల్లలంటే ఎక్కువగా మోజు పడతారుగదా? అందు కనివాన్ని చదివించాను. ఇంకా ఈ వృత్తిలోకి దింపలేదు. అసలు పిల్ల కూడా అలాంటిదికాదు. కాని మీ మిత్రుడిని చూస్తూంటే ఈ దిష్టిపిడతల్లో దేన్ని అప్పగించడానికి మన సొప్పడంలేదు. బాబుగారు అనుమతిస్తే.... నా కూతుర్నే పువ్వులా మీదోపిట్లో పెడతాను.... దానికి ఈ సంగతులేవీ తెలియవు. బాబుగారే మచ్చిక చేసుకోవాలి.''

''సరి, సరి మా వాడు ఇలాంటి

మూలకాలు, సంయోగాలు, మిశ్రమాలు అంటే ఏమిటో వివరించుతూ స్పీడుగా చెప్పుకు పోతున్న కెమిస్ట్రీ లెక్చరర్ దృష్టి అపర కుంభకర్ణునిలాగ నిద్రపోతున్న గోపాలం మీద పడింది. అంతే!....ఆయన ఉగ్రుడై పోయి పోయి తాడెత్తున లేచి—

''గోపాలం! ...మూలకాలంటే ఏమిటి? మూల పదార్థాలకి ఉదాహరణ చెప్పు?... ''

నిద్రలో ఉన్న గోపాలం తెలివి తెచ్చుకొని యిలా జవాబిచ్చేడు—

''మూలన దాచబడిన పదార్థాలు మూల పదార్థములు సార్! ...మన చీపురు కట్ట... బూజులు దులుపుకర్ర వగైరాలు సార్!....''

—రామవరపు గిరిజాశంకరి, విశాఖ-1.

వాటికి కొత్త. గాటికి అలవాటు పడని గిత్తను పట్టిస్తానంటే ఎలా?''

''ఓ గంటలో మా అమ్మాయి వస్తుంది ఇక్కడికి. ఇంట్లో ఏం తోచడం లేదు, కాస్సేపు శరణాలయంవెళ్ళి కాలక్షేపం చేసి వస్తానంటూ అది తయారవుతూంటే నేను పరిగెత్తుకు వచ్చాను. చెప్పాను కదా, మా అమ్మాయికి ఇలాంటి సంగతులేవీ తెలియనీ లేదని.... వాణీ, మంజులా! జాగ్రత్త. బాబుగారిని శరణాలయం దర్శించడానికి వచ్చిన ఓ ఆఫీసరులా పరిచయం చేయండి. మరి నే వస్తాను. ఇంటిదగ్గర అది నా కారు కోసం ఎదురుచూస్తూ ఉంటుంది." చిన్న గున్నేనుగులా వడివడిగా వెళ్ళిపోయిందామె.

''పోదామా?' లేవబోయాడు హరనాథ్.

''కూర్చో. ఆమెను చూచిపోదాం''

''చూడడానికి ఏముందిలే?'' తిరిగి అస్థిమితంగా కూలబడ్డాడు. మురళితో వాళ్ళేవో సరసాలాడుతున్నారు, త్రుళ్ళుతున్నారు. ఆవేవీ చెవికెక్కడం లేదు జోరీగల మధ్య చిక్కినట్టుగా ఉంది ప్రాణం.

ఇంటి ముందు కారాగింది. మరుక్షణంలో గుమ్మంలో సాక్షాత్కరించింది, తళతళ లాడే జపాను జరీ చీరలో తెల్లగా మెరిసిపోతూ ఓ దేవకన్యలా. ఆ దేవత తనదిగా వాగ్దానం పొందడం వల్ల చాలా నిస్సంకోచంగా నిశితంగా పరికించాడు. నిలువెల్లా జారిపోతున్నా ఆమె సౌందర్యపు తళుకులను.

అపరిచిత యువకద్వయాన్ని చూచి సంకోచంగా ఆగిపోయింది ఆ యువతి. నల్లపట్టి ఉన్న రిస్ట్‌వాచి కట్టిన చేత్తో చీర కుచ్చిళ్ళు అదిమిపట్టి, వేలికి ఉన్న ఉంగరంలో చిలుక పచ్చరాయి మెరుస్తూంది. చెవుల మీదికి జారిన ముంగురుల నుండి తీగలా అగపడుతూన్న బంగారు రంగుల జపాన్ జరీ మెరుపులతో పోటీ పడుతున్నాయి. శంఖులా ఉన్న మెడలో ఒంటి వరస బంగారు గొలుసు తళుకు లీనుతూంది.



మంజుల అనే అమ్మాయి ముందుకు వచ్చి "రా, అక్కా, వీళ్లు మన శరణాలయం వివరాలేవో కనుక్కో పోడానికి వచ్చారట ఆ బాబుగారు ఓ లక్ష్మీపుత్రుడట. మన శరణాలయానికి పెద్ద మొత్తం విరాళ మిచ్చే ధర్మప్రభువుల్లాఅగపడుతున్నారు" అంటూనే ఓ చూపు వ్యంగ్యంగా మురళి మీదికి విసిరింది. "ప్రియంవదగారి పుత్రిక "నీలకాంతప్రభా" అంటూ పరిచయం కూడా చేసింది.

"నమస్కారమండీ." మర్యాదగా చేతులు జోడించి అక్కడే ఉన్న కుర్చీలో కూర్చోబోయిన నీలకాంత మంజుల సైగ అందుకొని లేచి ఆమె ననుసరించి పైకి వెళ్ళిపోయింది.

పది పదిహేను నిముషాల తరువాత క్రిందికి వచ్చిన నీలకాంత అక్కడ నిలువకుండా వెళ్ళిపోయింది.

హర్‌నాథ్ రూమ్‌కు వచ్చాడేగాని మన సంతా నీలకాంత మీద మోహంతో నిండిపోయింది. ఓ విధంగా పిచ్చి పట్టినట్టుగా తయారయ్యాడు.

అతడి అవస్థ చూడలేక ఓ రోజు, మురళి "రాయబారం నడిపేదా?" అని అడిగాడు నవ్వుతూ—ముందు ఎటపటాయించినా అంగీకరించక తప్పలేదు. తొలి వయసులో విరహం అలాంటిది. తిరిగి వచ్చిన మురళి, "ఆ అమ్మాయి ఊళ్ళో లేదట, వచ్చాక కబురు చేస్తానంది ప్రియంవద" అని చెప్పాడు.

మరో రెండు సార్లు మురళి ద్వారా ప్రయత్నించాడు గాని "ఊరినుండి రాలేదింకా" అన్నసమాధానమే వస్తూంది. "చూడబోతే ఆపిల్లను చూపకుండా ఊరించి ఎక్కువ గుంజాలని ఎత్తు ఉన్నట్టుంది," అభిప్రాయం వెలిబుచ్చాడు మురళి

నిర్లక్ష్యంగా చెప్పేశాడు హరనాథ్. "ఒక్కరాత్రి వెయ్యి పారేస్తానని చెప్పు. పైని ఇంకేం కోరినా ఒప్పుకొనిరా."

అక్కడికీ పని సానుకూల పడలేదు. "ఇహ ఆశ వదులుకో, భాయీ! పాపం, ప్రియంవద అందమైన కలలెన్ని గన్నదో గాని అన్నీ కూలద్రోసి నీలకాంత ఎవడితోనూ పరారయి పోయిందట."

మురళి తెచ్చిన వార్తవిని స్థాణువులా అయ్యాడు. కొన్ని రోజులు వెర్రిపట్టిన వాడిలా తిరిగాడు. తరువాత పరీక్ష పాసు

---

❋ భర్త:—ఏమిటే అది? కడుగా?

భార్య:—కాదండి. అది 'వనితా వాహిని'లో చూసి చేసిన పాయసం.

—వెలిచేటి శ్రీనివాసరావు. కాకినాడ.



కావడం, దూరప్రదేశంలో మంచి ఉద్యోగం వచ్చి వెళ్ళిపోవడంతో ఇంచుమించుగా నీలకాంతను మరిచిపోయాడు. అప్పుడప్పుడు ఆ వెరి వాంఛ గుర్తు వచ్చినప్పుడల్లా 'ఛీ ఛీ! ఎంత పొరపాటు జరిగిపోయేది?" అనుకొంటాడు.

* * *

హరనాథ్ దోసిట్లో ఉన్నది ఏదో ఒక చిత్తరువు కాదు, తన ముఖంలోకి దీక్షగా గుచ్చి చూస్తూంటే రెప్పలు ఎత్తడానికి సాధ్యం కాలేదు సావిత్రికి. అతడి చేతుల నుండి మృదువుగా ముఖం తప్పించి— "ఇప్పుడైనా ఒప్పుకొంటారా నేను సావిత్రినని?" అంది.

"ఉహుఁ.... ఒప్పుకోను. నువ్వు నీలకాంతవే!" దృఢంగా అన్నాడు.

"నిజంగా మీకు పిచ్చే పట్టింది. కాకపోతే ఏమిటీ సతాయింపు? నీలకాంత మీద మీ ప్రేమ బంగారంగానూ! నా వెంట పడ్డారేమిటీ?"

"ప్రేమించ లేదు. ఒక రాత్రికి వెయ్యి రూపాయలిస్తానన్నాను."

"అమ్మో! మంచి సచ్చరితులేనన్న మాట." మందహాసంచేసింది. "ఇంతకూ మీ నీలకాంత కథ చెప్పరూ?"

"ఓ! తప్పకుండా." కిటికీ చెంతకు వచ్చాడు. అడవి మొల్లనిండా మల్లెగుత్తులు

విచ్చుకొని పరువంతో విగ్రహీగుతూంటే తమకంతో వాయుదేవుడు ఊపి ఊపి నలుపుతున్నాడు.

వంగి ఐదారు మల్లెలు దోసిట్లోకి తీసుకొని ముక్కు దగ్గరకు చేర్చి గుప్పున పీల్చి— "ఓ మబ్బు పట్టిన రోజు" అంటూ ప్రారంభించాడు, ఓరగా నిశితంగా సావిత్రి ముఖభంగిమలు గమనిస్తూనే.

* * *

నల్లని చీకటి దొడి తలుపు గడియమీద ఓ సుకుమార హస్తం పడీ పడకముందే మోటుగా మరొక చేయి వచ్చి పడింది.

"నీలకాంతా!" గంభీరంగా వినిపించింది హరనాథ్ కంఠం.

"... .... .. ..."

"ఇప్పుడైనా నిజం చెప్పు. నీలకాంతవే కదూ?"

"... ...... ..."

"ఎందుకంత మోసానికి సాహసించావు? నీ ఎత్తుకు రాజమ్మణ్ణి ఎలా సహకరించిందో బోధపడ్డంలేదు. నయవంచనతో నక్క వినయాలతో అమ్మ మనసు ఎంతగా దోచుకొన్నా నువ్వు బ్రాహ్మణ పిల్లవు కావని తెలిపిన రోజు నడి ఇంట్లో గోయి తీసి పాతే యించగలదు."

"హరనాథ బాబూ!" ఇంచుక కటుదనంతో శాసిస్తున్నట్టు అంటూన్న సావిత్రి కంఠం విని నివ్వెరపోయాడు. రహస్యం బయట పడ్డందుకు తన కాళ్ళ మీదపడి ప్రాధేయపడుతుందనుకొన్నాడు. కాని ఇదేమిటి?

"మీ తెలివి తేటల మీద అంత నమ్మకం పెట్టుకోకండి. మీకు పట్టిన నీలకాంత పిచ్చివల్లే భయపడి పారిపోతున్నాను. ఏ దుర్బలక్షణం మీ నీలకాంత మీద పిచ్చి విజృంభించి నన్ను కబళించడానికి వస్తుందోనని. అంతేగాని నా రహస్యం ఏదో బయట పడిపోయిందని కాదు. నేను బ్రాహ్మల పిల్లను అవునో కాదో తేల్చుకోవాలని ఉంటే కుమ్మెరకు వెళ్ళండి. అక్కడ మా అమ్మ నాన్న

---

● తోటి ప్రయాణీకుడు పొగ తాగటం ఆమెకు దుర్భరమైంది. పొగ తాగటంవల్ల వొచ్చే కీడుల్ని ఏకరువు పెట్టింది.

"నేను నా పదహారో ఏటి నుంచీ పొగ తాగుతున్నాను. ఒక్క రోజు కూడా బ్రుదన చీదలేదు. ఇప్పుడు నా వయస్సు ఎనభై. దీనికి ఏమంటారు?" అన్నాడతను.

"పొగ తాగకుండా ఉన్నట్లయితే యిప్పటి మీ వయస్సు తొంభై ఐ ఉండేది!" అన్నదామె.

లేరు గాని— మా పిన్ని— మాసవి త్తల్లి ఉంది. 'నేనెవరో చెబుతుంది''

హతాశుడై పోయాడు హరనాథ్. అంత దృఢంగా పలుకు తూంటే బుకా యిస్తూందని అనుకోలేక పోయాడు. కాని, ఈ సావిత్రి అచ్చుగుద్దినట్లు నీలకాంత పోలికలో ఉండడమేమిటి? అలంకరణా అదీ స్థానాన్ని బట్టిమారిపోయి ఉండవచ్చు కాని అదే మనిషి!

''ఎప్పుడో రెండేళ్ళ క్రితం కొద్ది క్షణాలు మాత్రమే చూచిన నీలకాంత నా మాదిరిగా ఉంటుందని పంతం పట్టి కూర్చొన్నారు. మీ పిచ్చి వింతగావుంది.''

''రెండేళ్ళ క్రితం చూచినా, రెండు వందల సంవత్సరాల తరువాత చూచినా, మరో రెండు వేల జన్మల తరువాత చూచినా ఆమెను గుర్తు పట్టగలను. గాఢంగా చూచిన ఆ ఒక్క క్షణమే చాలు. ఆమె రూపం నాలో సుస్థిరంగా ముద్రపడిపోయింది.'' ఏదో తన్మయతతో చెబుతూ ఆగిపోయి— ''ఇదేదో నీకు ప్రేమ పిచ్చి కవిత్వంలా వినిపించవచ్చు పోనియ్యి నీలకాంత గొడవ. నువ్వు సావిత్రివే. ఇంట్లోకి పద. నువ్విప్పుడు పారిపోతే నేనేదో నిన్ను చేయబోయానని కథ అల్లగలరుజనం. హామీ ఇస్తున్నాను.


**NATIONAL INTEGRATION LANGUAGE SERIES**

**TO BE LEARNT IN 30 DAYS**

| | | Rs. P. |
|---|---|---|
| 1. | Tamil Through English | 2-90 |
| 2. | Tamil Through Hindi | 2-90 |
| 3. | Tamil Through Telugu | 2-90 |
| 4. | Telugu Through English | 2-90 |
| 5. | Telugu Through Tamil | 2-90 |
| 6. | Telugu Through Hindi | 2-90 |
| 7. | Hindi Through English | 2-90 |
| 8. | Hindi Through Tamil | 2- 0 |
| 9. | Hindi Through Telugu | 2-90 |
| 10. | Kannada Through English | 2-90 |
| 11. | Malayalam Through English | 2-90 |
| 12. | English Through Tamil | 3-75 |
| 13. | English Through Telugu | 3-75 |
| 14. | Sanskrit Through English | 3-50 |
| 15. | Bengalee Through English | 3-50 |

**30 రోజులలో తమిళ భాష**

తమిళము చదువుట, వ్రాయుట,మాట్లాడుట సులభ మార్గములో తెలుగు మూలముగా 30 రోజులలో నేర్చుకొనగలరు.

By

K. శ్రీనివాసాచారి P.O.L.

వెల: రూ. 2-90

V.P.P. ద్వారా 4-10

**BALAJI PUBLICATIONS**

17, Oil Monger Street, Madras-14

నావల్ల నీకే భయమూ రానివ్వను. అసలు వారం రోజులకంటే ఎక్కువుండనిక్కడ. నీ ఆధారం పోగొట్టిన పాపం నాకెందుకు అనవసరంగా? పద-పద, ఇంట్లోకి....'' అంటూ, సావిత్రి చేతిలోని సంచీ లాక్కొని దారి తీశాడు.

## 3

కొడుకు సెలవు అయి వెళ్ళిపోయేలోగానే ఏదో ఒక సంబంధం కుదిర్చి పెళ్ళి చేసి పంపాలని ఉబలాటంగా ఉంది కళ్యాణికి. దూరప్రాంతంలో ఉన్నాడు. జంట లేనివాడు (వయసు మహాచెడ్డది)

ఆరెండు మూడు రోజుల్లోనే పిలిచి నట్టుగా ఓ సంబంధం వచ్చింది. మారు చెప్పకుండా పెళ్ళి చూపులకు పయనమైంది కళ్యాణి, కొడుకు ఇప్పుడు కాదు కాదం టున్నా వినకుండా. ఉహపోరు పడలేక— ''నువ్వెళ్ళి చూచిరా'' అన్నాడు హరనాథ్.

సావిత్రిని కూడా పిలిచింది, ''ఈ కాలం పిల్లల ఎన్నికలే వేరుకదా? నువ్వూ చూద్దువురా'' అంటూ. సావిత్రి ఇష్టాయిష్టాలతో నిమిత్తమేముంది.? యజమానురాలి ఆజ్ఞ!

ఉమాపతిరావుగారితో సరితూగగల సంబంధమే. పిల్ల విద్యావతి. మెచ్చదగిన అందగత్తె కొడుకు చూచినా వంక పెట్ట డానికి ఏమిలేదు. తప్పక ఈ సంబంధం కుదరగలదన్న నమ్మకంతో పట్టలేని ఆనం దంతో తిరిగి వచ్చింది, కళ్యాణి.

కాని, కొడుకు మూర్ఖత ఆమె ఆశలన్నీ చెదరగొట్టాయి. ససేమిరా ఇప్పుడు పెళ్ళి చేసుకోనంటాడు. మన సంబంధం వాళ్ళకు కావాలనుకొంటే రెండు సంవత్సరాలు ఆగి రమ్మన్నాడు.

ఇదేమిటో బోధపడడంలేదు కళ్యాణికి. 'కొంపదీసి అక్కడెవర్నైనా మనసిచ్చాడా ఏమిటి.' అనుకొందామె కలవరంగా


''పిల్ల ఎంత చక్కనిది? పెద్ద-పెద్ద కళ్ళు—అంత కళగల ముఖం ఎక్కడా చూడలేదు.'' కొడుకులో ఉత్సాహం కని పించక, ''ఏమే, సావిత్రీ! పిల్ల చాలా బాగుంటుంది కదా? నువ్వు చెప్పు. ఎంత అందంగా ఉంటుందో ఆ అమ్మాయి ...'' అంది ఊరిస్తూ.

సావిత్రి ముసి-ముసిగా నవ్వింది ''నిజం. అంత చక్కని పిల్లలు చాలా అరుదు. అదృష్టం కావాలి అంత అంద

---

* విపరీతమైన లావెక్కిన ఆవిడ ''ఈ మధ్య చాలా భయంగా ఉంటోంది. నా నీడను చూసే నేను భయపడుతున్నాను'' అన్నది డాక్టర్‌తో.

''సహజమే మరి! మీ గొడుగు చూస్తే ఒక గుంపు వెంటాడుతూన్నట్లని పిస్తుంది!'' అన్నాడు డాక్టర్.



మైన సాహచర్యం లభించడానికి....''
అంది.

''వెటకరించడం కూడా వచ్చు ఈవిడకు!'' కోపం వచ్చింది హరనాథ్‌కు. ''అమ్మా, సావిత్రి అందంగా లేదూ?'' అన్నాడు.

తల్లి కంగారు పడింది. సావిత్రిని ఓ లజ్జా తరంగం ఢీకొట్టడం వల్ల అక్కడి నుండి పారిపోతుంటే అతడి మాటలు వినిపించాయి.

''మన యింట్లో వంట చేసే మనిషే ఇంత అందంగా ఉంటే మన యింటికి కోడలిగా రాబోయే ఆవిడ ఎంత అందంగా ఉండాలంటావు?''

కొడుకు వచ్చినప్పటి నుండి మాటి-మాటికి సావిత్రి అందం ఎత్తి చెప్పడంతో చిరాకనిపించింది కళ్యాణికి. 'వీడు యుక్తాయుక్తాలు విస్మరించే అంధుడౌతున్నాడా ఆ పిల్ల అందం చూచి! ఏవో సాకు ఎన్ని తన పుట్టింటికో, చెల్లెలి దగ్గరికో ఓ రెణ్నెల్ల పాటు సావిత్రిని పంపడం క్షేమమా?' అలా ఆలోచించి కూడా తిరిగి తమాయించుకొంది. కొడుకు సంగతి తనకు తెలుసు. గౌరవ హోదాలకు, అంతస్తు దర్పాలకు ఎన్నడూ హాని రానిచ్చేవాడు కాదు. యవ్వన సహజంగా ఓ విధమైన ఆకర్షణకు లోబడవచ్చు. అది పెళ్ళిదాకా పోనిచ్చే అవివేకి మాత్రం

కాదు....అజాగ్రత్తతో చెయ్యి యిస్తే ముప్పు తెచ్చుకొనేది సావిత్రే. దానికి ఎవరి బాధ్యతా ఉండదు. అంత యిదే వస్తే నీకూ, నీ పిల్లలకూ తిండీ, గుడ్డా పడేస్తాం పడి ఉండమంటుంది।

"అమ్మా-అమ్మా।" అంటూ హృదయమంతా అప్పగించి కపటం లేకుండా ప్రవర్తించే సావిత్రికి ఆ అమ్మగా పిలువబడే ఆమెలో యింత కుచ్చితపు ఆలోచన ఉండగలదని ఎలా ఊహించగలదు?.... అయితే, కొడుకు వచ్చేదాకా ఆవిడలో అంతటి పాపపు తలంపు జొరబడడానికే అవకాశం లేదు. స్వచ్ఛంగా, హృదయస్ఫూర్తిగానే "సావిత్రీ, సావిత్రీ" అంటూ ప్రతి దానికీ సావిత్రిని పిలుస్తూ, ఆమె సలహా తీసు దాల్చవలసిందే.

## 4

మధ్యాహ్నం ఎండ మనుషుల్ని తోచనీయడం లేదు.

పడుకొంటే నిద్ర పట్టదు. ఒంట్లో చెమటలు కారిపోతుంటే ఏమిటో బద్ధకంగా, అలసటగా, చిర-చిరగా ఉంది. పక్కమీద దొర్లే కొద్దీ యింతేనని లేచి క్రిందికి వచ్చాడు హరనాథ్.

"సావిత్రీ, కొంచెం మంచినీళ్లు।"

సావిత్రి జాడ లేదు. కొడుకు కేక విని తల్లి వచ్చింది. "మంచినీళ్లు కావాలా, హరీ?"

"ఉఁ....సావిత్రి లేదూ?"

"దొడ్లో గొడ్లపాకలో ఉందేమో।"

"అక్కడెందుకుంది।"

"వడ్ల కమ్మర్ల పిల్లల్ని పోగేసుకొని చదువు చెబుతూ ఉంటుంది. మధ్యాహ్నం ఓ రెండు గంటల సేపు అక్కడ."

"అమ్మో, పాఠాలు చెప్పే చదువొచ్చా?"

"సావిత్రి తండ్రి మేష్టారు పనిచేసేవాడట. ఇంట్లో ఆ పిల్లకు ఎన్నో సంగతులు చెప్పేవాడట. బళ్లో సెవెంత్ క్లాసు వరకూ చదివిందట కూడా. చాలా తెలివైన పిల్ల. అదృష్టం ఒకటి తక్కువుంది గాని."

"ఉహూఁ?" తల్లి మంచినీళ్ళు యిస్తే తాగి గొడ్లపాక వైపు దారి తీశాడు.

"నల్లనివాడు....ఎవరు? కృష్ణమూర్తి. కృపారసం పైజల్లెడువాడు... కృపారసం అంటే దయాగుణం, పైజల్లెడువాడు.... నవ్వు రాజిల్లుమోము వాడొకడు చెల్వల మానధనంబు దోచెనో మల్లియలార...."

ఆగిపోయింది సావిత్రి. ఎదురుగా చూరుక్రిందికి వచ్చి నిలబడిన హరనాథ్‌ను చూచి.

"చాలా శ్రావ్యంగా పాడుతున్నావు. సంగీతం వచ్చు కదూ?"

"ఏదో కొద్దిగా, మా నాన్న నేర్పించేవాడు. కొంచెం పెరిగి పనీ పాట అందు

కోవడం మొదలు పెట్టాక మా పిన్ని ఏదీ సాగనివ్వలేదు. కాని, నాకు చదువన్నా, సంగీతమన్నా చాలా జిజ్ఞాసగా ఉండేవి. పిల్లలంతా అన్నాలు తినేసి పడుకొన్నాక 'పిన్నీ, పనేం లేదా?' అని అడిగి ఆవిడ చదువుకొమ్మంటే అప్పుడు దీపం ముందు కూర్చొనే దాన్ని."

"ఓ! నువ్వు చాలా కష్టాలు పడ్డావన్న మాట? నీ సవితి తల్లి నలుచుకు తినేదా? ఒక్కొక్కటీ అడిగితే లాభం లేదు. నీ కథంతా చెప్పు అభ్యంతరం లేకపోతే. మీ నాన్న ఉన్నాడా యిప్పుడు?"

"అక్కడ నిలబడే వుంటారా? లోపలికి రండి."

గొడ్లపాక అయినా విలక్షణంగా ఉంది లోపల. వర్షాకాలమైతే రొచ్చు-రొచ్చుగా ఈగలు, దోమలు ముసురుతూ అసహ్యంగా ఉంటుంది గాని వేసవి కాబట్టి అంతా ఆరిపోయి పేడ వేసి అలికినట్టుగా ఉంది.

పక్కకు ఓ మూరెడెత్తుగా ఓ మనిషి పడుకోడానికి అరుగు సామాన్యంగా జీతగాడు పడుకొంటూ ఉంటాడు దాని మీద. సావిత్రి పిల్లలకు పాఠాలు చెప్పడానికి అధిష్ఠించే ఉచ్చస్థానమదే. క్రింద ఈత చాప మీద పది-పన్నెండు మంది పిల్లలు ఉన్నారు. ఇద్దరు తప్ప అంతా ఆడపిల్లలే. ఒకరిద్దరు పన్నెండు-పదమూడేళ్ళలో ఉండే అమ్మాయిలు కూడా ఉన్నారు. అప్పుడే ఓ పిల్లకు పెళ్ళయినట్టుంది కూడా, కాలి వేళ్ళకు యింకా కొత్తదనం పోని వెండి మట్టెల చుట్లు మెరుస్తున్నాయి.

అరుగు మీద గోనెపట్టా దులిపి వేసి "కూర్చోండి." అని చెప్పి తను చాప మీద చతికిల బడింది పిల్లల పక్కగా. పెళ్ళయిన పిల్లా, మరో పిల్లా హరనాథ్ ఎదుట కూర్చోవడం సిగ్గుగా తోచి, "రేపొస్తాం, పంతులమ్మా!" అంటూ వెళ్ళిపోయారు.

ఆ గోనెపట్టా మీదే అడ్డం ఒరిగి తల క్రింద చేయి పెట్టుకొన్నాడు హరనాథ్.

---

ఎవరైనా నీ సలహా కోరాడంటే సాధారణంగా అతడు నీ నుండి పొగడ్తను ఆశిస్తాడు.

—చెస్టర్ ఫీల్డ్

---

"చల్లగాలి బాగా వస్తుందే యిక్కడికి! అందుకే మధ్యాహ్నం యిక్కడ చోటు చేసుకొన్నావన్న మాట!"

"ఇంట్లో కంటే నయం. మిద్దె కాక, గోడల కాక ఉండవు. తాటికమ్మల కప్పు క్రింద....ఉం, ఎక్కడి నుండి మొదలు పెట్టేదబ్బా?" బుగ్గన వేలుంచుకొంది సావిత్రి

"పుట్టినప్పటి నుండి...." అన్నాడు నవ్వుతూ.

[సశేషం]

# పెద్ద కథ



అమ్మకు తొలి చూలు బిడ్డను. కాని—

అమ్మ బాలింత జాడ్యం పుట్టి నా మూడో మాసంలోనే నన్ను విడిచి పోయింది. నాన్న ఎలిమెంటరీ స్కూల్ మాస్టరు. మాస్టరు గిరి తప్ప మరో ఆధారం లేని పేద వాడు. ఒంటరి వాడు. ఆడ దిక్కు లేని అతడు నన్ను ఏడాది పాటు పెంచేటప్పటికి నానా అవస్థా పడ్డాడు. ఇరుగు పొరుగులు ఒకటి రెండు రోజులు సాయపడ గలరు. ఎల్లకాలం ఎవరు చేస్తారు? "పెళ్ళి చేసుకో బాపనయ్యా" అంటూ సలహా ఇచ్చారు. ప్రధమ కళత్రం మీద ఎంత ప్రేమాభిమానాలు ఉన్నా అవసరాన్ని గమనించక తప్పింది కాదు నాన్నకు. సంతానకుచేలుడైన మరో బతకలేని బడిపంతులు కూతురే నాకు పిన్నిగా వచ్చింది.

సీరియల్

జ్యోతి

''పిన్ని తరువాత చాలా మంది తమ్ముళ్ళూ, చెల్లెళ్లూ ఉన్నారట. పిల్లలకు లాల పోయడం లాలించడం పాలు పట్టించడం ఎత్తడం దించడం అన్నీ పుట్టింటనే అబ్బాయి ఆవిడకు. పిల్లలను ఎత్తిఎత్తి రొండి కాయకాచి పోయిందట మా యింటికి వచ్చేటప్పటికే. అందుకే చాలా సహజంగా, నిస్సంకోచంగా తన స్వంత చెల్లెలిని చూచుకొన్నంత ముద్దుగా అపురూపంగా చూచుకొనేది పిన్ని నన్ను. కాని ఆత్మీయుల నుండి ప్రేమాభిమానాలు సంతానాన్ని పొందింది. పెరిగి పోయిన సంసారం. నాన్నకు వచ్చే చాలీ చాలని జీతంతో కడుపు నిండిన తిండి. ఏటా కాన్పులతో పూర్తిగా నీరసించి పోయింది పిన్ని. పిల్లలు జబ్బులు ఏడుపులు ఎడతెగని పని. దరిద్రం. చికాకు. అలాంటి వాతావరణంలో నాకు సుఖమయ జీవితం కల్పింపబడలేదని వాపోవడం తెలివి తక్కువేమో. అక్కడికే పిన్ని వాపోయేది, నా తల మీద చెయ్యేసి బొట బొటా కన్నీరు కార్చేస్తూ. 'మీ అమ్మ

## పోల్కంపల్లి శాంతాదేవి

తనివితీరా పొందే అదృష్టమే నాకు ఉంటే అమ్మ ఒడికి దూరమయ్యే దాన్ని కాదు. మా యింటికి వచ్చిన ఏడాది లోపలే తను పండంటి పాపను ఎత్తడంతో నా మీద శ్రద్ధ తగ్గిపోయింది పిన్నికి.'' ఆగింది సావిత్రి.

''అక్కడనుండి కష్టాలు మొదలయ్యాయేమో నీకు?'' సానుభూతి వ్యక్తపరిచాడు హరనాథ్.

''ఆఁ....అవి కావాలని పెట్టిన కష్టాలనడం తప్పేమో. పిన్నిది ఏటా కాన్పు. కాపరానికి వచ్చిన పదేళ్ళలో అష్టమ ఉంటే నువ్విలా అయ్యేదానివి కావేమో సత్తీ! ఎంచక్కా అందరి పిల్లల్లా చదువు కొంటూ....హుఁ! నా అదృష్టమే చిన్నది. దానికి నేనేం చేస్తాను? నా కడుపున పుట్టినా యింతకంటే చేసేదాన్ని కాదు. నీ చెల్లెలు పరిమళను చూడు! పిల్లలను ఎత్తి ఎత్తి దాని రొండికాయ కాచిపోయింది....నీకు మారుటి తల్లిగా వచ్చి నీకుండే సుఖం కూడా తుడిచి పెట్టాను. నన్ను క్షమించు, సత్తీ!''

''అందుకే నేనంత బాధ పడేదాన్ని కాదు ఆ జీవితానికి, నాన్న కూడా నా

కోసం ప్రత్యేకంగా చేయగలిగింది లేదు ఏ అపరాత్రిలోనో లేచి నా తలమీద చెయి వేసి నిశ్శబ్దంగా రోదించడం తప్ప ఎన్నో సార్లు అలాంటి దృశ్యం నా కంట బడింది.


"పిల్లలతో చేసుకోలేని పిన్నికి సాయంగా బడి మానవలసి వచ్చినా నాన్నకు కొంచెం మనసు స్థిమితంగా, శాంతంగా ఉన్నప్పుడు పిలిచి దగ్గర కూర్చోబెట్టుకుని భారత భాగవతాలలో ఏదో పద్యం రాగయుక్తంగా ఎత్తుకొని దాని సందర్భం ఆ ఘట్టం ఎంతో చక్కగా వివరించి చెప్పేవాడు. ఎన్నో పురాణ ధర్మాలు వినిపించేవాడు. బాగా ఎండిన నేల వాన చినుకు పడుతూనే పీల్చి వేసు కొన్నట్టుగా జిజ్ఞాసతో అలమటించి పోయే నాకు ఏది విన్నా ఒక్కొక్కసారికి ఒంట బట్టి పోయేది. ఎంత పేదపిల్లనైనా నలుగురిలో మంచి అనిపించుకొనేలా నడుచుకోగలుగు తున్నానంటే మా నాన్న పెట్టిన జ్ఞాన భిక్షే."

"అంత పేదరికంలోనూ నువ్వొక విలక్షణమైన యువతిగా రూపొందావంటే నిన్ను పెంచిన మీ పిన్ని కూడా కొంత మట్టుకు సంస్కారవంతురాలే అనిపిస్తుంది."

"ఆఁ ..తనూ పేదరికంలో పుట్టి పేదరికంలో బ్రతుకు ఈడ్చిన మనిషి అందరిలో ప్రవహించేది ఎర్రటి రక్తమే ఉండేది ఒకటే కంఠ కదా కులమేమిటి మతమేమిటి అనుకొంటాం గాని కొంత సంస్కృతీ సంస్కారయుత భావాలు జన్మతః వసాయన కొంటాను నా అనుభవాన్ని బట్టి. కట్టు గుడ్డతో తపస్సు చేసిన రోజులున్నాయి, ఒంటిపూట భోజనంతో డొక్క కట్టిన రోజులున్నాయి. ఇంట్లో ఎంత దుర్భరమైన రోజులున్నా చెరగని కుంకుమతో, మాయని గుడ్డతో బ్రాహ్మణ్యం ఉట్టిపడుతూ ఉండేది పిన్ని, ఇరుగు పొరుగులో మాట్లాడేది రెండుమాటలైనా మృదువుగా ఎదుటి మనిషిని నొప్పించ కుండా మాట్లాడగలగేది. అంతటి దారిద్ర్యంలోనూ కుటుంబ మర్యాదను కాపాడుకో గలిగిందంటే ఆ శక్తి ఆవిడ రక్తంలోనే ఉండాలి."

"మీ నాన్న ఉన్నాడా ఇప్పుడు? పెన్షన్ తీసుకున్నాడేమో బహుశః" కరక్టేనా అన్నట్టు చూచాడు.

"ప్రభుత్వం ఇవ్వలేదు పెన్షన్. భగవంతు డిచ్చాడు తన ఇరవయ్యోఏటనుండి బరువు బాధ్యతలనే కాడి మెడమీదికి ఎత్తుకొని నీరసించి నడవలేకపోతే కండ కరిగిఎండిపోయిన చర్మంక్రింద హృదయ విదారకంగా అగుపడేగూడలమీద ఇల్లాలు పిల్లలు అనే ముల్లుగర్రలు పొడిచి పొడిచి హెచ్చరిస్తూంటే ఈడ్వలేక ఈడిగలబడు తూన్న ఆయన కష్టాలకు కనికరించి తలుగు తప్పించి కాడి దించాడు భగవంతుడు, రెండేళ్ళయింది ఆయన పోయి."




"మితిమీరి ఉంటాయి మీ కష్టాలప్పటి నుండి."

"అంత మితిమీరలేదు. మా పిన్ని పుట్టింటివాళ్ళు కొంచెం మెరుగుపడ్డారు ఈ మధ్య నాన్న పోయాక వాళ్ళసాయం అడపాదడపా అందుతూ వచ్చింది. మా పెద్ద తమ్ముడిని తీసుకుపోయి ఏదో పని నేర్పుతున్నాడు కూడా మా పిన్ని అన్నగారు. ఎన్నీ భరించుకుపోయే మనిషి ఉండగా తెలియని బరువు బాధ్యతలు ఆయన పోయాక ఎవరివి వారు గుర్తుచేసుకొన్నారు. సంసారం అంతా బజారున పడకుండా సాగిపోతుంటే మా పిన్ని అన్నగారు ఓ సంబంధం తెచ్చాడు నాకు. "నాకు బొత్తిగా సమ్మతంలేని సంబంధం ప్రథమ కళత్రం తన జ్ఞాపకార్థం ఇద్దరు పిల్లల్ని మిగిల్చిపోయింది. వయసంత మీరిపోయిందైనా చాలీచాలని జీతగాడు. నా అయిష్టత గమనించింది పిన్ని. 'ఒప్పుకోకపోతే ఎలానే సత్తీ? రెండో సంబంధమని నాకూ మనస్సు కొట్టుకుంటూనే ఉందనుకో. కాని మీ నాన్నకు నేను రెండో సంబంధమని ఎప్పుడూ జ్ఞాపకం వచ్చేది కాదు నాకు. రానురాను అన్నీ మామూలుగా సర్దుకుపోతాయి జీవితంలో. అదీ నా అనుభవం. ఇంతకంటే మంచి సంబంధం నీ పేదపిన్ని ఎక్కడి నుండి తెస్తుంది చెప్పు?"

"ఇప్పుడు నాకు పెళ్ళికాకుంటే నేం? నా తమ్ముళ్ళకూ. నా చెల్లెళ్ళకూ చేసు-

కొంటూ ఇక్కడ ఇలా ఉండనీ పిన్నీ!'' ఏడిచాను, పిన్నిపాదాలు చుట్టేసి.

''పిన్ని పాదాలు కర్కశంగా అంది: 'ఎదిగిన పిల్లవు పెళ్ళి పెటాకులులేకుండా ఉండిపోతా నంటావా! నీకు హాయిగా ఉంటుందేమో గాని లోకులు విసిరే రాళ్ళదెబ్బలకు మీ నాన్న తల అడ్డంగా కూడా లేదు. అన్ని రాళ్లదెబ్బలకు తట్టు కొనే శక్తి నా తలకు లేదు, ఆ రాళ్ళవర్షం నుండి ఈ మారుటమ్మ తలను కాపాడు దయచేసి' వలవలాఏడుస్తూ అక్కడినుండి పారిపోతూ. 'ఇష్టం లేకపోతే అంత బల వంతం చేయనులే. అయితే ఆ సంబంధం తప్పిపోనీయను. నా బిడ్డ పరిమళకు నిశ్చయం చేయమని చెబుతాను' అంది నా బిడ్డ అని ఒత్తి చెప్పడంలో నువ్వు కావన్న సంగతి మొదటిసారిగా గుర్తుచేసి నట్టు అనిపించింది.

''ఒప్పుకోనూ లేను ఒప్పుకోకుండా ఉండి ఆమె ఎదుట నిర్భయంగా నిస్సం కోచంగా తిరగనూలేను. ఒక రాత్రంతా ఆలోచించిన మీదట తోచిన పరిష్కార మార్గం ఒక్కటే- ఇంట్లోనుండి పారి పోవడం. గమ్యం నిర్ణయించుకోకుండా రైలెక్కిన నాకు దైవంలా తటస్థపడింది రాజమ్మగార్కి. పెద్ద వయసులో పడినమనిషి. వయసు ఇచ్చిన పెద్దరికంతో తన కేమీ అడ్డు లేదన్నట్టుగా 'ఏ ఊరమ్మాయ్! పెళ్ళయిందా? ఎక్కడికి వెడుతున్నా' వంటూ అడుగుతూంటే ఏవో అబద్ధాలతో తప్పించుకొంటున్నాను. ఎదురు బెర్తుమీద ఉన్న బామ్మ ఏదో అడిగితే రాజమ్మగారు తన సంగతి చెబుతూంది. ''ఉమాపతి రావుగారిని-దొరలు లెండి, వాళ్ళ ఇంట్లో నా ఇరవయ్యో ఏటనుండి వంటమనిషిగా ఉంటున్నాను. వయసు వస్తూంధా? పోతూందా! ఏ ఏటి కా యేడు ఒపిక తగ్గి పోతూంది నాకు మరో మనిషిని చూచు కొమ్మని అయిదేళ్ళనుండి చెబుతున్నాను. ఊహుఁ. నన్నే పట్టుకు వేళాడుతున్నారు. నన్ను విడిస్తే నాలా కలిసిపోయే మనిషి నమ్మకమైన మనిషి దొరుకుతుందో లేదో నని వాళ్ళభయం. ఏం చేసేది? నా కో కూతురు ఉంది. పెళ్ళయింది. పిల్లలు కూడా ఉన్నారు. ఇంకా ఎన్నాళ్లుచేస్తావు. చాకిరీ-వచ్చిఉండమని ఒక టేపోరు.''

''నాన్న చిన్నప్పుడే పోయాడు:అమ్మ ఈ మధ్యేపోయి దిక్కులేనిదాన్ని అయ్యా నని రాజమ్మగార్కి చేతులు పట్టుకొన్నాను. ఫలితంగా ఆవిడస్థానంలోకినేనువచ్చాను. యిదీ నా కథ!''

''అక్కడినుండి వచ్చేశాక మీ పిన్ని వాళ్ళ సంగతు లేవీ తెలియవన్నమాట.''

''ఊహుఁ. పరిమళను ఆ రెండో సంబంధం వాడికిఇచ్చి చేసిఉంటారేమో!''

సావిత్రి కథ ముగిసేలోపల పిల్ల లంతా జారుకొన్నారు, తాటికమ్మల కప్పు క్రింద యిద్దరే మిగిలారు.

"ఈ మధ్యాహ్నం మంచి కాలక్షేపమే అయింది నీ కథతో. ఓ చక్కని ఒక పాట వినిపించు."

"మీకంటే పనిలేదు. నాకు లేదను కున్నారా?" నవ్వుతూ లేచి చాపచుట్టింది సావిత్రి. బలవంత పెట్టకుండా తనూ లేచాడు హరనాథ్, "అప్పు డప్పుడూ తీరికచేసుకొని నాకు సంగీతం నేర్పు తావూ? నేర్చుకోవాలని మహా ఉబలాటంగా ఉంది."

"ఫీజు వంద రూపాయలు!"

"అంత విలువైన సంగీతం నా బోటి వాడికి ఒంటబడ్తుందో లేదో?"

"మరే!" అంటూ నిర్లక్ష్యంగా వెళ్ళి పోతున్న సావిత్రికి వెనకనుండి — "సా....రీ...." అంటూ హరనాథ్ తీస్తున్న రాగం వినిపించి నవ్వుకొంది' 'గర్వపోతే కాదు. కొంటెమనిషి కూడా,

# 5

హరనాథ్ వాచ్ చూసుకొన్నాడు. అయిదు దాటింది. సావిత్రి రావటంకోసం పావుగంట నుండి నిరీక్షిస్తున్నాడు, ఈ సాయంత్రం తోటకేసి వెడదామని కూర్చొన్నాడు. సావిత్రి వచ్చేజాడ కనిపించక తనే ఫ్రెండ్సుతో వెళ్ళాడు.

వంటింట్లో పీటమీద స్థిమితంగా కూర్చొని ఉలూపొంగా ఆరగిస్తున్నాడు తమ్ముడు సుధాకర్. ఎమ్మే పరీక్షలయ్యాక ఫ్రెండ్స్‌తో వినోద యాత్రంటూ వెళ్ళి ఇవాళ ఉదయం దిగాడు. "మీ చేతిలో ఏదో మంత్రం ఉందండోయ్! మీ చేత ఏది చేసినా యింత రుచిగా ఉంటుందేమిటి? పసిరిక పాముతోక నిమిరారా."

"అదేమిటి?" అంది సావిత్రినవ్వుతూ

"జనం వాడుకది. పసిరిక పాము నిమి రితే ఆచేత వంటకాలు బాగా కుదురుతా యని." అప్పటికే మూడుప్లేట్లు ఖాళీ చేసి



ఓ చెంబుడునీళ్ళు గటగట తాగేసి జేవ్ మని తేల్చాడు.

"మీరే వచ్చారా! యిప్పుడే తెద్దామను కొంటున్నాను" పీటవేసి ఆలూ బొండా ప్లేటుపెట్టి ఆహ్వానించింది హరనాధ్‌ను.

"అదంతా తీసివెయ్యి. టీ మాత్రం యివ్వు!" గుమ్మందగ్గరే నిలబడ్డాడు హరనాధ్.

కెటిల్‌నుండి డికాక్షన్ కప్పులోకి వంచుతూన్న సుధాకర్ మరో కప్పులోకి కూడా వంచి పాలూ, పంచదారా కలిపి "యిందు అన్నయ్యా! తీసుకో" అంటూ కప్పు అందించి, మరోకప్పు తను తీసుకొని అరనిమిషంలో పీల్చేసి గబగబా వెళ్ళిపోయాడు. హరనాధ్ కావాలనే నిదానం చేశాడు. పొన్నచెట్టుక్రింద కృష్ణమూర్తి వలె షోగ్గా కాలుమీద కాలువేసుకొని కూర్చొని "అబ్బో! యిద్దరికీ దోస్తీ బాగా ఉన్నట్టుందే!"

"తెలిసే!" ఫక్కుమని నవ్వింది సావిత్రి

ఆ ఉచ్చారణకు కించిత్ ఆశ్చర్యానికి లోనయ్యాడు హరనాధ్ " ఓ! యింగ్లీషులో మాట్లాడగలవే!"

ముసిముసిగా నవ్వుతూనే అంది: "ఎంతకాలి ఎంత వంటమనిషినైనా ఒకనాడు స్కూలు మాస్టరు కూతురినే కదండీ!"

"ఊఁ" మూలిగాడు దీర్ఘంగా. "అది సరే. అసూయ ఏం కనిపించింది యిప్పుడు?"

"మరి, అతి ప్రియమైన ఆలుబొండా ఎందుకక్కర్లేదన్నట్టు!"

"నా కోసమే చేసినట్టు!"

"భలేవారు! మీ కోసమని పేరుపెట్టి చేస్తేనే మీరు ఆరగిస్తారన్న మాట" ఒకే రక్తం పంచుకొని ఒక తల్లికడుపులో పుట్టిన అన్నదమ్ముల్లో ఎన్నికగిన వ్యత్యాసమే ఉంది. ముఖ్యంగా స్త్రీపట్ల వారికుండే దృక్పథాల్లో అన్నగారికి స్త్రీ ఒక ఆకర్షణీయమైన అవసరవస్తువు.పురుషాధిక్యత ఎప్పటికప్పుడు ప్రదర్శించుకొంటూ ఆడవాళ్ళ చిన్నచూపు చూడడం అతడి స్వభావం. తమ్ముడు పూర్తిగా వ్యతిరేకం. స్త్రీ అంటే అతడి కో పూజ్యభావం. "ఆడవాళ్ళంటే నీ కెందుకయ్యా యింత అభిమానం" అందో సారి. "ఆడవాళ్ళ ఆత్మీయత సాహచర్యమే శ్రీరామరక్ష సావిత్రమ్మా" అన్నాడతడు నిర్మలంగా నవ్వుతూ.

"పాపం.ఆడవాళ్లు ఎంతకనిచేస్తారు!" అంటూ జాలిపడే సహృదయుడైన అమాయకుడు. అత వొచ్చాడంటే సావిత్రి వంటింట్లో ఉన్నంతసేపూ ఆ దరిదాపుల్లోనే ఉంటాడు. వద్దన్నా వినకుండా కూరగాయలు తరిగిపెడుతూనో వంటకు అవీ యివీ అందిస్తూనో.



''వంట మనిషితో ఆ చనువూ, ఆ రాసుకుతిరగడం ఏమిటిరా మర్యాద తెలీకుండా?'' అంటూ ఓ సారి తల్లి మందలించగా సావిత్రి విన్నదికూడా.

''యించుమించు మీ యిద్దరికీ ఒకే వయసేమో. నీకు కవలపిల్లలు పుట్టారనుకో, అమ్మా'' తేలిగ్గా నవ్వేశాడు సుధాకర్, ''తెలివి తక్కువగా, అప

ట్యంగా ఏవీ చిత్రించటోకమ్మా. నీకు తెలీకుండా ఏదీ జరుగబోదు ఈ యింట్లో నా మీద విశ్వాసముంచి నిశ్చింతగా ఉండు.''

ఆ తరువాత ఏమనడానికీ సాహసించలేదు కళ్యాణి.

''ఎక్కడికో తయారైనట్టున్నారు?''

''తోటదాకా వెళ్ళొద్దామని. వస్తావా నాతో?''

చురుగ్గా చూచింది సావిత్రి. ''వంటలక్కతో షికారుకొడితే ఊరివాళ్ళు నవ్వుతారు. అంత సరదాఉంటే తొందరగా శ్రీమతిని తెచ్చుకోండి.''

''ఎక్కడుందని?'' చిలిపిగా అడిగాడు.

''అమ్మ చూచినచోట.''

మాట మార్చాడు. ''తోటచూచావా?''

''ఎదీ? ఒకటి రెండుసార్లు అమ్మను అడిగాను తోటకు వెళదామని. పోదాం పోదాం అంటూనే ఏడాదితిరిగిపోయింది.''

''వన భోజనం ప్రోగ్రామ్ వేసుకొందామా? అమ్మా, నువ్వూ.... అయితే ఓ చిన్న రిక్వెస్టు! తోటలో నీ పాటొకటి ఉండాలి.''

''పాట లేకుంటే తోట బాగుండదా?'' నవ్వింది సావిత్రి.

''చాలా చక్కటి నవ్వు. గులాబిరేకుల మీద వెలుతురు దొరినట్టు!'' వెనుదిరిగాడు.

* * *

నాలుగురోజులల వర్షం పడుతూనే ఉంది ఏదో ఒకపూట. నేల బాగా తడిసి భూమి పచ్చబడింది. పొలాల్లో విత్తనం పడింది.


బాగా మబ్బుపట్టినరోజు. వనభోజనం ఏర్పాటు జరిగింది. పదిగంటలకల్లా పెసర చద్ది, పులిహోర, వెజిటబుల్ బిర్యానీ చకచకా రెండు స్టీల్ కారియర్‌లోకి నింపేశారు సావిత్రీ, సుధాకరూ.

తొలుత ''అలాగే పోదామ్రా'' అన్న కళ్యాణి తీరా వాకిట్లో బండికట్టే సమయానికి-''ఏం వనభోజనమ్రా! వర్షం పడేట్టుంది. అనవసరంగా తడిసి.... అదో అవస్థ'' అంది నిరుత్సాహంగా.

సావిత్రిగుండెగతుక్కుమంది. ఇంట్లో కట్టిపడేసినట్టుగా ఉంది, మార్పులేని నిత్యకృత్యాలతో విసుగ్గాఉంది. కొన్ని గంటలు ప్రకృతి మధ్య ఆహ్లాదంగా గడిపిరావచ్చని మనసు గంతులు వేస్తుంటె కళ్యాణి అయిష్టత నీళ్ళుగుమ్మరించి ఛెళ్ళున కొట్టినట్టయింది.

కళ్యాణికూడా ఎప్పుడప్పుడూ అలా బయటకి తిరిగిరావాలని అనిపిస్తూంటుంది. కాని గత [illegible] కాలు తీయాలంటే అదేమిటో [illegible]. గుండెల్లో దడ పుడుతుంది. ఇంట్లోనే కూర్చోవాలనిపిస్తుంది, అదొక పిరికిదౌర్బల్యం.

''వర్షంవస్తే తోటలో మనింట్లో




కూర్చోవచ్చు పదమ్మా'' అన్నాడు పెద్ద కొడుకు.

''దారిలో వస్తే!''

''నీ వన్నీ అనుమానాలే పదమ్మా. అంతగా వర్షం వస్తే గొడుగు పడతాం గాని.''

''ఏదైనా పడితే అదే పట్టు ఈపిల్లల ఉడుంపట్టు.'' విధిలేక లేచింది కళ్యాణి.

'అమ్మయ్య' అనుకొంటూ కారియర్‌లు, బావినుండి నీళ్ళు తెచ్చుకోడానికి చిన్న బిందె, నాలుగు గ్లాసులూ బండిలోకి చేర్చింది సావిత్రి.

''మీరూ రండి.'' భర్తను పిలిచింది కళ్యాణి.

''ఏముంది చూడడానికి అక్కడ? ఇంత అట్టహాసంగా బయల్దేరారు'' నిత్యం చూచేతోటే గనుక ఆయన కేమీ ప్రత్యేకత కనిపించలేదు.

''ఏదో ఆ చెట్టూచేమా, పిల్లలు సరదాపడుతున్నారని గాని నాకు మాత్రం అంతగా వెళ్ళాలని ఉందా ఏమిటి? మీరు పదండి వెనుకొస్తాను.''

అరగంటకు బయలుదేరినా వాళ్ళను అందుకోగలడాయన.

వెనకటికాలం వాళ్ళనడక వేరు. చూడడానికి నడకే అయినా సాగేది పరుగు. రామావతారంలో మూరెడుపావాల వాళ్ళు ఉండేవారన్నా, చెట్టంత మనుషులుండేవారన్నా, పర్వతాలను బంతుల్లా ఎత్తిఎత్తి

ఆడుకొన్నారన్నా నమ్మవచ్చుననుపిస్తుంది మన ముందే వెనుకటితరంవాళ్ళనుచూచి, వాళ్ళ దేహదార్ఢ్యంచూచి.

బండి మెయిన్‌రోడ్డు ఎక్కింది. పెద్ద రోడ్డు కాబట్టి రెండుపక్కలా పెద్ద పెద్ద మేడలు లేవుగాని. డాబాఇళ్ళే ఉన్నాయి. అవి మోతుబరిరైతులవీ, పేద రైతులను పట్టీలలో ఆడుకొనే పెద్ద కోమట్లవీ ఉంటాయి. ఏదో రెండుమూడు ఆఫీసు బోర్డులుకూడా కనిపించాయి ఇళ్ళమధ్య.

బండి రోడ్డుదిగి సందులోకి మళ్ళు తూంచేసన్నంలేక బూజుసెట్టైలున్నఎత్తయిన ప్రాకారంతో ఆలయమొకటి కనిపించింది. "ఏం దేవుడు?" అడిగింది సావిత్రి.

"చెన్నకేశవ స్వామి" బండివాడు చెప్పాడు.

ఓ కొత్త ప్రదేశం చూస్తుంటే ఏదో వింత అనుభూతి. ఎలాంటి మనిషినైనా [illegible]పివేస్తుంది, అందులోనూ ఏవో పూర్వ కట్టడాలో, దేవాలయాలో, [illegible] సౌధాలో, ఎత్తయిన అందమైనకొండలో విశాలమైన పచ్చనితోటలో అయితే ఆ [illegible] మరింత అనిర్వచనీయం.

[illegible] పరికిస్తూంది సావిత్రి. ఇక్కడికి వచ్చి [illegible] వస్తూనూ ఇటువైపు వచ్చే అవసరం రాలేదు. [illegible] కూరగాయలు కోసమో వస్తానన్నా వెళ్లనిచ్చేది కాదు కళ్యాణి. తెచ్చేవాళ్లు ఉన్నారు కదాని. ఎప్పుడో మరీ విసు గనిపించినప్పుడు. దిక్కు తోచకుండా ఉన్నప్పుడు దొడి ద్వారంలోంచి అవతలపడి అక్కడేవున్న వడ్లకమ్మర్ల దాతిలో కాసేపు కూలబడేది వాళ్ళపని చూస్తూ, వాళ్ళకబుర్లు వింటూ, నాగళ్ళు బాగుచేయించుకు పోయేవాళ్ళు. బండిగిర్రలకు పట్టా లేయించుకు పోయే వాళ్లు—పొద్దుటినుండి చీకటిపడేదాకా భలే సందడిగా ఉంటుంది. ఊరి విషయాల్ని ఎన్నో వింతలు విడ్డూరాలూ కూడా విన వచ్చు. ఊళ్ళో ఏ విశేషం జరిగినా వడ్ల కమ్మర్లను దాటకుండా పోదు. అప్పు డప్పుడు కావలసినంతకాలక్షేపం అక్కడ సావిత్రికి.

ఊరు చివర చిన్నచిన్న పాకలు. పేద [illegible]గా పెంటకుప్పలు. బండిలోకి కుతూహలంగా తొంగిచూచే అనాగరిక జనం సరిగ్గా ఒంటిమీద గుడ్డలులేనిపిల్లలు వికృతంగా కేకలుపెడుతూ బండిని పట్టుకొని [illegible] పరిగెత్తుకు వస్తూంటే బండి వాడు అదిలించాడు.

బండి ఇళ్ళు పాకలు దాటి పొలాల [illegible].

అక్కడక్కడా ఎత్తుగా పెరిగిన [illegible] తుప్పలు, [illegible] గంగేడుచెట్లు పచ్చగా మొలిచిన గడ్డి. దగ్గరగా అగు పిస్తూనే దూరంగా [illegible] కొండలు. వాటిని [illegible] పరిగెత్తు[illegible]

వస్తూన్న నీలి మేఘాలు - మనోల్లాసానికి అంతకంటే మించినదృశ్యం ఏంకావాలి!

తోటముందు బండి ఆగింది.

వాళ్ళకంటే ముందే చేరిన సుధాకర్ రెండుచేతులా రెండు కారియర్లు అందుకొని ముందుకు దారితీయగా బిందె చేత బట్టుకొని ఏదో తన్మయత్వంతో కదిలింది సావిత్రి.

బండివాడితో ఏదో మాట్లాడుతూ మెల్లగా వాళ్ళను అనుసరించింది కళ్యాణి. పిల్లలు ఎప్పుడో బండిదిగి మాయమయ్యారు.

తోటచుట్టూ ఎత్తుగా గుబురుగా వెదురు పొదలు పెరిగాయి. సపోటా, ముసాంబీ జామ, మామిడి - పళ్ళచెట్లే అధికంగా ఉన్నాయి. పూలచెట్లు ఒకప్పుడు వైభవంగా పెరిగాయేమోగాని ఇప్పుడు నామమాత్రంగా ఉన్నాయి శ్రద్ధా పోషణ లేక. "శ్రద్ధ తీసుకొంటే చాలా బాగా పూసేవి కదా పూలు?" నొచ్చుకొంది సావిత్రి.

"మా మామగారు పెట్టారు ఈ తోట, పూలమ్మి చూద్దామని పూలతోట వేసి, పెంచారు. పూలమ్మిన ఏడే మా అత్తయ్య పోయింది అనుకోకుండా. అచ్చి రాలేదని పూలమ్మడం మానేశారు. ఇహ ఈ పూలన్నీ పూసి ఏం ప్రయోజనమని శ్రద్ధతగ్గి చివరికి పాడుపెట్టారు." చెప్పింది కళ్యాణి.

తోట మధ్యలో పెద్దది మోటబావి వుంది. నిత్యం ఇంజన్ పెడతారు కాబట్టి బాగా లోతుకు అడుగుకుపోయాయి నీళ్ళు. లోపల కూతపెడితే పైకి వినిపించదేమో బావిపక్కనే ఊడలుదిగిన మర్రి చెట్టు. క్రింద పచ్చికలో ట్రాన్సిస్టరు పెట్టుకొని శేషతల్ప శాయిలా తలక్రింద చెయిపెట్టుకొని అడ్డంగా పడుకొన్నాడు హరనాథ్.

పచ్చని పచ్చికమీద తెల్లని లాల్చీ పైజామాలలో అతడు....

ఒక క్షణం చూచి ముఖం తిప్పుకొని ముందుకు పోయింది సావిత్రి.

కొడుకుదగ్గరే చతికిల బడింది కళ్యాణి. రావుగారు కూడా వచ్చారు. ముగ్గురూ కబుర్లలో ఉండగానే సుధాకర్ వచ్చాడు. కొన్ని మోదుగాకులు రెండు చొప్ప దంట్లతో సావిత్రికోసం అటూ ఇటూ చూచి "అమ్మో, సావిత్రమ్మో! ముందు వనభోజనాలయ్యాక తరువాత వనవిహారం రండి ముందు" అంటూ కేకేశాడు.

కొత్తగా వాళ్ళనాన్న ధోవతితీసి కట్టుకొన్నాడు. అలవాటులేని గోచి ఎగదోపుకొంటూంటే తల్లి ఆపేక్షగా చూచి నవ్వింది. ఎదిగిన పిల్లల్లో ఇంకా పోని పిల్లచేష్టలు, కుర్రతనం ఉత్సాహం చూస్తుంటే తల్లికి అదో ముద్దు వేడుక.

"సుధకు ఏళ్ళువచ్చాయి గాని ఇంకా కుర్రతనం పోలేదండీ!"

సావిత్రి వచ్చింది. మూడు మోదు కాకులు దగ్గరగా పేర్చి పరిచి కొంగులో కోసుకు వచ్చిన బొండు మల్లెమొగ్గలు పోసింది.

జాలిని అభినయిస్తూ చొచ్చొచ్చో! కన్నెపిల్లల కన్నుపడ్డాక సుమ కన్నెలు పూర్ణజీవితం నోచుకోవు కదా?" అన్నాడు సుధాకర్.

"భావకవిత్వమునకు ధన్యవాదములు" నవ్వుతూ ఆకులు తీసుకొంది. ఆకులు కట్ట డానికి సావిత్రి, విస్తళ్ళు అయ్యాక బిందె అందుకొని బావిదాకా వెళ్ళి-"ఒక్కదాన్ని బావిలోకి దిగాలంటే భయమేస్తుంది" అంటూ కేకపెట్టింది. "ఇంజన్ వెయ్యి పో అలాగే కాళ్ళు కడుక్కోవచ్చు." చిన్న కొడుకుతో చెప్పింది కళ్యాణి.

సుధాకర్ వెళ్ళాడుగాని కరెంటు లేదు "దిగండిక. తోడుగా నేనూ వస్తాను."

"కరెంటు లేదా?" అంటూ లేచాడు హరనాథ్. ఇంజన్ గదిలోకి వెళ్ళి ఏదో చూచినట్టు చూచి ఇవతలికివచ్చి బావిగట్టు మీద నిలబడ్డాడు లోపలికి చూస్తూ బిందె తోమి నీళ్లనింపుకొని మెట్లెక్కి వస్తూ సుధాకర్ విసిరిన ఏ విట్టుకో పగలబడి నవ్వుతూన్న సావిత్రి దీర్ఘంగా ఇటే చూస్తున్న హరనాథ్‌ను చూడలేదు. వాళ్ళు పైకివచ్చాక అతడు బావిలోకి దిగాడు.

భోజనాలు అయ్యాయి.

"ఊఁ ఇక కానీ గానకచేరీ." తల్లి పాన్‌దాన్ దగ్గరపెట్టుకొని నింపాదిగా ఆకుకు సున్నం పట్టిస్తూ అడిగాడు హరనాథ్.

"అబ్బే! ఇప్పుడుకాదు. గొంతుదాకా మెక్కి....ఇప్పుడు పాడమంటే - అబ్బే ఎక్కసంగా ఉంది."

"మంగళారాతూలివిగో....మా రామా చంద్రునకు...." కీచుగా రాగంతీసి, "ఇంతేకదా ఏం పాడినా? అలాంటి పాట అయితే అక్కరలేదు. మాంచి చక్కని సినిమా...."

"కాస్సేపు నువ్వూరుకోరా సుధా. సావిత్రి ఏం పాడుతుందో వింటే గుడ్లు వెళ్ళబెడతావు."

"అహాఁ?"

"అప్పుడప్పుడు పద్యాలవీ పాడుకొం టూంది. గొంతు బాగానే వుంది. పాడవే, సావిత్రీ!"

రావుగారుకూడా చిరునవ్వుతో అడి గారు "పాడమ్మా నీ పాట వినిపోతాను. మీరు తరువాత నిదానంగా వచ్చేద్దురు."

పెద్దమనుషులు అర్థించాక కాదనడం మూర్ఖంగా ఉంటుందని సావిత్రి గొంతు సవరించి. త్యాగరాజ కీర్తన ఎత్తుకొనే ప్పటికి విస్తుబోయారు శ్రోతలు ముగ్గురు!

సావిత్రిలో గుప్తమైన పాండిత్యం బయటపడడంతో పనిపాటలో చురుకైన పిల్ల అన్న వాళ్ల ప్రేమకుతోడు ఇప్పుడు ఓ విధమైన గౌరవభావం కూడా మిళిత మైంది.

"ఇంత చక్కని గాత్రం ఎక్కడ దాచావే ఇన్నాళ్ళూ?" బుగ్గమీద వేలుంచు కొంది కళ్యాణి. (సశేషం)

# పెద్ద కథ



(గత సంచిక తరువాయి)

"రేడియోలో పాడడానికి మీకు తప్పకుండా ఛాన్సు దొరుకుతుంది ... అంగీకారంగా ఒక మాట చెప్పండి. తరువాత సంగతులన్నీ నేనే చూచుకొంటాను. అప్పుడు రేడియోలో మీ పాట విని ఆనందిస్తాం."

సుధాకర్ మాటకు నవ్వేసి మౌనం వహించింది సావిత్రి. కొంచెం సిగ్గుగా.

"ఏదమ్మా ఇంకొక్కటి." రావుగారు చిరునవ్వుతో అర్థించాడు

సావిత్రి గాన ప్రవాహం ఒక పక్క సాగిపోతుంటే మరెక్కడో కొట్టుకుపోతున్నాడు హరనాథ్ తన ఆలోచనలతో. శాస్త్రబద్ధంగా పకడ్బందీగా ఇంత బాగా పాడగలదని అతడు కూడా ఊహించలేదు. సావిత్రి చెప్పిన కథనం ప్రకారం అలాంటి పేద వాతావరణంలో

పిల్లలతో బీదరగా ఉండే ఆ ఇంట్లో ఇంత గొప్ప గానం సాధించడం సాధ్య పడే సంగతి కాదు. ఇంతటి గాన సంపద తండ్రి దగ్గరుంటే అతడిని మరీ అంత దీనుడిగా బీద జీ వి గా బరువు లాగే బక్కచిక్కిన ఎద్దులాగా సావిత్రి చిత్రించడం అమరమయిన అతడి ఆత్మకు అవమానకరం. సావిత్రికిచ్చిన మాట ప్రకారం ఇన్నాళ్ళుగా స్మృతి పథంలోంచి తప్పించిన నీలకాంత రూపం చటుక్కున మెరిసింది. కొన్నేళ్ళు నిర్విచార మానసంతో సాధన సలిపితే గాని పట్టుబడని సంగీత మది. అలాంటి అవకాశం భోగం పిల్ల నీలకాంతకే ఉంది!

కళ్యాణితో ద్రాక్షతోట దిక్కుగా సాగిపోయాగా రావుగారు.

"నలుపు-తెలుపు మేఘాలు ఆకాశంలో పెండ్లి ఊరేగింపులా సాగిపోతుంటే పిచ్చుక గుంపులు చెట్లకొమ్మల్లో కిచ-కిచలాడుతూంటే, ఒక్కు గగుర్పొడిచేలా చల్లని పిల్లగాళ్ళు సాగి వస్తూంటే పచ్చని నిండైన తోటలో అప్పుడే రెక్కలు మొలిచిన పిచ్చుకమ్మే అయింది సావిత్రి. చెట్లమధ్య, పరిగెత్తి-పరిగెత్తి చివరికి ఓ అల్లనేరేడు చెట్టు పొ... గూర్చుంది.

క్రింద ... ... ... సుధాకర్. "ఆపై కొమ్మ ఊపండి. బాగా పండిన పళ్ళున్నాయి దానికి."

పళ్ళు రాల్చి, చేతికందిన రెండు పళ్లు తెంపుకొని ఒకటి నోటికందించి,సుఖంగా ఉన్న కొమ్మ చూసుకొని నింపాదిగా కూర్చొంది సావిత్రి. క్రింద చాలా పళ్ళు రాసిలా పడ్డాయి. కొన్ని చిలకలు కొరికనవి. కొన్ని గాలికి రాలినవి. వాటిలో తాజా పళ్ళను ఏరుకొంటూన్న సుధాకర్ అన్నగారు రావడం చూచి ఏరిన వళ్ళలో నాలుగు పళ్ళు అతడి చేతిలో పెట్టి మరో దిశగా వెళ్ళిపోయాడు.

"పళ్ళు రాల్చేదా అండీ"

"అక్కర్లేదండీ!" కీచుగా వెక్కిరిస్తూ చెట్టెక్కి అతడూ ఓ కొమ్మ మీద కూర్చున్నాడు. "కోతిలా చెట్టెక్కి వచ్చి కాయలు రాల్చేస్తూ కూర్చున్నారు. తోట వాళ్ళు చూస్తే తంతారు."

"తన్నే మాట తరువాతగాని అండీ అంటున్నారేమిటండీ?"

"సంగీత విద్వాంసులు! పట్టు శాలువలతో సత్కరించక పోయినా కనీసం బహువచనం తోనైనా మన్నించ వద్దు?"

"విద్వాంసురాలినా?"

"ఊ....."

"రేపు రేడియోలో పాడతారేమో?"

"సినిమాలో కూడా పాడతానేమో"

"ప్రఖ్యాత గాయకురాలివై పోయాక ... వాళ్ళు వస్తారనుకో మీ జీవితంలో విశేషాలు చెప్పమంటే—ఫలానా రోజుల్లో ఫలానా వాళ్ళింట్లో వంట చేసి బ్రతికేవాన్ని అని చెబుతావా?"

అదంతా నిజమే అయినట్టు "అం.... చెబుతాను. తప్పేముంది? రంకుతనం, దొంగతనం కాకపోతే మరేపనైనా తప్పు లేదు. సిగ్గెందుకు?" అంది సావిత్రి చాలా నిర్మలంగా.

సావిత్రి కూడా తాంబూలం వేసు కొంది. ఎర్రగా పండిన పెదవులు నేరేడు పండు కొరకడంతో కొద్దిగా నీలిరంగుకు తిరిగి గమ్మత్తుగా అగుపడుతూంది.

"నిజంగా దురదృష్టవంతురాలివి సావిత్రీ! పుట్టినప్పటి నుండి నిన్ను దౌర్భాగ్యం పీడిస్తూనే ఉంది. కాని, నిన్ను

"అనిపించకే అడుగుతున్నాను."

"ఒక ముక్కలో చెప్పాలంటే దానికి జవాబు - ఆశ. వివరించమంటే..." ఎందుకో ఆగింది సావిత్రి.

"ఉం....చెప్పు. ఎలాంటి ఆశలో? నీకు ఆశలేవో ఉంటాయని కూడా అని పించదు"

చిన్నగా నవ్వింది సావిత్రి. "ఈ చెట్టు క్రింద నిన్న మొన్న మొలిచిన లేత గడ్డి కనిపిస్తూంది. ఇదే నెలా-రెణ్నెల్ల తరువాత వచ్చి చూస్తే అంతా పెరిగి నేలంతా అల్లుకుపోయి పచ్చని పచ్చిక

# పోల్కంపల్లి శాంతాదేవి

చూస్తే నాకు ఆశ్చర్యం కలుగుతోంది. మొక్కకు చీడలా మనిషికి వ్యాధిలా దరిద్రం మనిషి జీవితం కుంచించుకు పోయేలా చేస్తుంది. నిన్ను చూస్తే అలాంటి వాతావరణంలో పుట్టి పెరిగినదానిలా అగు పించవు. ఇంత [illegible] నవ్వుతూ, [illegible] ఎలా [illegible]న్నావో - ఆశ్చర్యంగా ఉంటుంది. అలాంటి జీవితం ప్రాప్తించిందేమిటా అని నీకెప్పుడూ బాధగా అనిపించదూ?"

"అలా అనిపించినట్టు మీకెప్పుడైనా అనిపించిందా?"

పరుపులా తయారవుతుంది. వాటి మీద ఎన్నో జీవులు పాదాలు పెట్టి నడిచి పోతాయి. ఆ కాస్సేపు వాటి అడుగుల క్రింద అణిగిన గడ్డి అడుగులు తీస్తూనే మళ్ళీ తలెత్తుకు నిల్చుంటుంది [illegible]. మరి కొన్నాళ్ళ తరువాత చూస్తే [illegible] [illegible] ఏదో [illegible] [illegible] తెస్తూ [illegible]నికి [illegible] ఉంటుంది. ఆ తరువాత ఎండి ఒరుగై పోతుంది కూడా. కాని వాటి వేళ్లు నేలలో ఉన్నంతవరకూ దానికి చావు లేదు. తొల కరి చినుకులు పడుతూనే ఇలా చిగుళ్ళు

వేపి పచ్చగా పైకి వచ్చేస్తుంది.

"జీవితం పచ్చిక బయలు అయితే ఆశ వేళ్ళు! ఈ ఆశ ఉన్నంతవరకు జీవితంలో చావు లేదు. ఈ పచ్చని పచ్చిక లాగే ఎప్పుడో అదృష్టం నా జీవితంలో పరుచుకు పోతుంది. ఆ ఆశ ఉండబట్టే నవ్వుతున్నాను, తుళ్లుతున్నాను, చలాకీగా గంతులు వేస్తున్నాను.

"అదృష్టమంటే ఏ విధమైంది?" కుతూహలంగా చూచాను సావిత్రి ముఖంలోకి.

"జీవితంలో ఏ సమయానికి అది అందడమే అదృష్టమంటే."

"ఓ! తెలిసింది. పెళ్ళి చేసుకోగలిగితే ఇహ సుఖపడిపోగలనన్న ఆశ ఉందేమో నీకు. ఏ జమీందారు ఇంటికో కోడలు కాగలనన్న ఆశ కూడా ఉందేమో!" ఓరగా చూచాను.

ఇంతసేపు స్వచ్ఛంగా, సరళంగా మాట్లాడుతున్న సావిత్రి నేత్రాలలో క్రోధపు జీరలల్లుకు పోయాయి. తీక్షణంగా అంది: "ఉహుం.... జమీందారులంటే, శ్రీమంతులంటే మీరు అపోహ పడేంత గొప్ప ఉద్దేశ్యం లేదండీ, నాకు! జమీందారులంటే ఎవరు? ఒక రాత్రికి వెయ్యి రూపాయలిచ్చి ఒక జీవితం బలి గొంటామనే రాక్షసులు. మేడి పండ్లు. అలాంటి వాళ్ళ ఇళ్ళలో పోయి పడాలని నిజం తెలిసిన ఏ ఆడదీ ప్రశాంత జీవనం కోరుకొన్న ఏ ఆడదీ కోరదు." ఆ తరువాత అతడికి మాట్లాడే అవకాశం యివ్వకుండా సర-సర చెట్టు దిగిపోయింది.


తను విసిరిన బాణం ఒడుపుగా పట్టి, తిరిగి తన మీదికే గురిచేసి విసురుతుందని అనుకోలేదు. అమ్మ ఎంత జాణ! పైకి కనిపించేంత అమాయకురాలివి కాదు, సావిత్రీ! అసలు నువ్వు సావిత్రివి కాదు. ఈ తెలివి తేటలు, ఈ వాక్చాతుర్యం భోగంస్త్రీ ప్రియంవద కూతురికే ఉండాలి. సావిత్రిగా నువ్వు చెప్పిన కథంతా ఒక కల్పన!' అనుకొన్నాడు గట్టిగా.

హరనాధ్ ఈ వనభోజనం ప్రోగ్రాం వేసి బలపరిచింది. ఒక విధంగా సావిత్రికి చేరువ కావాలనే. కాని అనుకోకుండా అతడంటే ఆమెకున్న అయిష్టత బయట పడడంతో హరనాధ్ ముఖం నల్ల బడింది.

# 6

ఒకనాటి ఉదయం ఉమాపతిరావుగారి ఇల్లు సన్నని శోకాలతో-ఆందోళనతో నిండిపోయింది.

మామూలుగా రావుగారి దినచర్య ప్రకారం వేప పుల్ల నోట పెట్టుకొని పొలాలవైపు వెళ్ళారు. ఆయనలో ఈ మధ్య కొంచెం అనారోగ్యం బయల్దేరింది. డాక్టర్లతో పరీక్ష చేయించుకొంటే బ్లెడ్ ప్రెషర్ అన్నాడు. ఇవాళ కాలు




చెయ్యి స్వాధీనం తప్పి పొలం గట్టుమీదే కూలబడి పోయారు. బండిలో ఇంటికి చేర్చబడ్డారు. ఎంతటి దేహదార్ఢ్యం కల మనిషి అయినా వయసు తెచ్చే మార్పుకు తల ఒగ్గక తప్పలేదాయనకు.

ఆ వార్త ఎప్పుడు ప్రాకిపోయిందో గాని ఊరు పూరంతా అక్కడే వచ్చి చేరింది. ఒకవేళ పార్వతీదేవిలా ఉన్న కళ్యాణి పసుపు కుంకుమకు ఏమైనా కీడు జరిగితే? ఆడవాళ్ళు కంట తడి పెట్టారు. దంపతులకు పదిహేను పద్దెనిమిదేళ్ళ వ్యత్యాసం ఉన్నా అంత కనిపించదు... రావుగారు మంచి దృఢమయిన మనిషి. కళ్యాణి తొలుత నుండీ స్థూలకాయురాలు. ఈడూ జోడూ బాగా కనిపించేది ఇద్దరికీ.

''మగవాడికి కుడిపార్శ్వం, ఆడదానికి ఎడమ పార్శ్వంలో పక్షవాత వస్తే కుదరడం కొంచెం కష్టమే. మూడు రోజులు, మూడు నెలలు, మూడేళ్ళు— అదృష్టం ఉండి బ్రతికితే ఆ తరువాత బ్రతుకొచ్చు గాని ఇహ మంచంలోనే అన్నీ. అబ్బా! అలాంటి బ్రతుకు బ్రతకడం కంటే భగవంతుడు తీసుకు పోవడమే మేలు.''

ఆ మూల ఎవరి తోటో అంటున్నారు మెల్లగా. ఎంత మెల్లగా అంటున్నా సుధాకర్ చెవిలో పడ్డాయి. చిచ్చుబుడ్డిలా లేచి అందర్నీ తరిమి వేశారేమో. తక్షణ వైద్యం జరగాలంటే ఆ ఊరి ఆయుర్వేద వైద్యుడి శరణు కోరక తప్పలేదు. ఏదో మనసు తృప్తి కోసమే గాని, అతడితో తగ్గుతుందని నమ్మకం లేదు. ఏదో ఉప

ాంతి, పట్నం నుండి పెద్ద డాక్టరును సుకు వచ్చేవరకు.

కాని, ఏమిటో అధైర్యంతో కుళ్ళి-ళ్ళి ఏడవసాగింది కళ్యాణి.

''ఏమిటమ్మా యిది? ఎందు కేడుస్తున్నావు? నాన్నకేమైందని? మంచి-మంచి మందులొచ్చాయి. పెద్ద డాక్టర్లను తీసుకువస్తాను. తప్పక నయమౌతుంది. నువ్వేం అధైర్య పడకు. నాన్న ముందే నువ్విలా డీలా పడి శోకాలు పెడుతూ కూర్చుంటే ఆయన పరిస్థితి మరీ విషమిస్తుంది.'' తల్లిని అనునయించాడు హరనాధ్.

''ఏం నయమైనా ఆయన మొదటిలా తిరగ్గలుగుతారా? అన్నీ మునుపటిలా చూసుకోగలుగుతారా?

''వయసు వస్తూందా పోతుందా అమ్మా. నాన్నకు? దగ్గర దగ్గరగా ఏభై అయిదేళ్లు వచ్చాయేమో నాన్నకు? విశ్రాంతి తీసుకోవలసిన వయసే కదా యిది? ఏమంటే ఆయన ఆరోగ్యంగా ఉండి అన్నీ చూసుకో గలుగుతున్నారన్న ధైర్యంతో మేం బయట హాయిగా తిరుగుతున్నాం. యిప్పుడు నేనో సుధో ఇంటిదగ్గరఉండి అన్నీ చూసుకోమా ఏమిటి? చెట్టంత కొడుకులను పెట్టుకొని ఏమిటమ్మా ఏమిటీ అధైర్యం?''

తల్లిని ధైర్యంగా ఉండమని చెప్పి పట్నం వెళ్ళిపోయాడు హరనాధ్ డాక్టర్ కోసం.

ఇందరి ధైర్యం ఒకఎత్తు, అందరి అవసరాలు చూస్తూకూడా రావుగారిమీద ఈగ వాలకుండా చేసే సావిత్రిసేవ ఒక ఎత్తు. కాలు చెయ్యి పడిపోయినఆయనకు మనిషి అవసరం ఎంతైనా ఉంది. నవనాడులూ కుంగిపోయి శోకాలుపెట్టడం తప్ప మరేమీ తోచడంలేదు కళ్యాణికి.

రావుగారి పరిస్థితికూడా చాలా దయనీయంగా ఉంది. నిర్జీవంగా పడివున్న కాలు చెయ్యికేసి బాధగా చూసుకొంటున్నారు. గంటక్రితందాకా అన్నీ ధీమాగా చూసుకొనే ఆయన కళ్ళలో బిత్తర చూపులు చోటుచేసుకొన్నాయి. మతి స్థిరంగా ఉందో లేదో ఏమిటో అర్థంలేని పిచ్చి చూపులు చూస్తున్నాడు. మాట్లాడబోతే మూతి పక్కకు ఈడుస్తూంది. నాలిక సరిగా దొర్లడంలేదు కూడా. బ్రతికి ఉండగా చావడంకంటె మనిషికి దుర్భరమైన నరకం వేరే ఏముంటుంది?

''మీరేం దిగులుపడకండి బాబాయి, మీకు తప్పకుండానయమైపోతుంది. అంత వరకు మీ చెయ్యి కాలు నేననుకోండి.''

సావిత్రి అనునయింపుకు ఆయన కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఒకడి రోగ బాధను మరొకడు తీసుకోలేడు. కాని, ధైర్యం యివ్వడంలో సానుభూతి అనునయింపులలో సగంబరువు దించుకోగలడు ఇవతలి మనిషి.



ఆయుర్వేద వైద్యుడు ఏదో తైలమిచ్చాడు. చేతికి కాలుకూ పట్టించి మర్దించమని. ఒకరు కాలూ, ఒకరు చెయ్యీ పుచ్చుకున్నారు సావిత్రీ సుధాకర్ అదంతా చూస్తూంటే రావుగారి ప్రాణాలు పైకి పోతున్నాయి. 'ఇలా ఒకరిచేతిలో చిక్కి ఎన్నాళ్ళు బ్రతకాలి. భగవాన్! గుండె ఆగిఆగి అప్పటికప్పుడు చావడం ఎంత పుణ్యం!' ఉదయంవరకు మృత్యువు ఛాయనే లేనిమనిషి ఇప్పుడు క్షణ క్షణం ఆతురతతో మృత్యువును ఆహ్వానిస్తున్నాడు?

ఆ మధ్యాహ్నానికల్లా పెద్ద డాక్టర్ని తీసుకొని వచ్చాడు హరనాధ్.

డాక్టరు అంతా పరీక్షించి, పిచెంజికి మందు ఎక్కిస్తుంటే గాఢంగా నిట్టూర్చాడు ముసలాయన,

"భీష్ముడు అంపశయ్యమీద పడుకొని మృత్యువుకోసం నిరీక్షించినట్టు. మరణం నన్ను దయతలచి వచ్చేదాక ఈ సూదుల పరంపరమీద ఆధారపడాలి కాబోలు!

కళ్యాణి ఘొల్లుమంది.

"అలా నిరుత్సాహపడకండి రావుగారూ! మృత్యువును దూరంగా తరిమివేసి, ఆరోగ్యం ప్రసాదించడానికే ఈ సూదులు" అంటూ నవ్వాడు డాక్టరు.

వారం పదిరోజులు గడిచిపోయాయి. రావుగారిలో ఆశించినంత మెరుగుదనం కనిపించకపోయినా ఆ పరిస్థితికి అలవాటుపడుతున్నారు అయనా, ఇంట్లోవాళ్ళూ.

ఒకనాటి మధ్యాహ్నం భర్త మంచం దగ్గర కూర్చొన్న కళ్యాణి భవిష్యత్తునేమిటన్న ఆలోచన వెళ్ళదీసింది.

"పెద్దవాడు ఇక్కడుండలేడు. ఈ పల్లెటూళ్ళో ఓ నాలుగు రోజులుంటే మహా భాగ్యం. అలాంటిది ఇక్కడే ఉండిపోయి ఆ జీతగాళ్ళతో వేగుతూ పొలంపనులవీ చూచుకోగల సామర్థ్యం లేదు. ఏమైనాఉంటే సుధే ఉండాలి ఇంటి దగ్గర. నలుగురిలోకి పోగలడు నాలుగు దిక్కులా చూచుకోగలడు. పైరు పచ్చ అంటే వాడికున్న ఆపేక్ష పెద్దవాడికి లేదు. పెద్దవాడేమైనా పట్నవాసంలో వైభవం వెలగబెట్టవలసిందే

ఆవిడ మాటలు భర్తతోపాటు ఇద్దరు కొడుకులూ విన్నారు.

♦ ♦ ♦

హరనాధ్ పొలాలవైపు వెళ్ళి వచ్చేటప్పటికి రాత్రిఅయింది. గుడ్డలు మార్చి, కాళ్లు చేతులు కడుక్కొని భోజనాల గదిలోకి వెడుతూంటే సావిత్రితో సుధాకర్ అంటూన్న మాటలు వినిపించాయి

"అన్నయ్య ఇష్టపడి ఉంటానంటే సరే. కాదంటే ఇంటి దగ్గరుండిపోవడానికి నాకేం అభ్యంతరం లేదు"

హరనాధ్ రావడం చూచి పీటవేసి అన్నం వడ్డించింది సావిత్రి:

సుధాకర్ చెయ్యి కడుక్కొని వెళ్ళబోతూ అన్నగారి మాటలు ఆగివిన్నాడు.

"నీ చదువు ఇక్కడితో ఆపి ఇంటి దగ్గరుండడం ఏం బాగు? నీ కిష్టమైనంత వరకూ చదువుకో. ఎం. ఏ. అయ్యాక రిసెర్చికి వెళ్ళాలని అంటూండేవాడివి కదా? రేపు ఉద్యోగానికి రిజైను పంపెయ్యాలని నిశ్చయించుకొన్నాను. మంచి ఉద్యోగమే అనుకో. అయినా ఉద్యోగాల మీదే బ్రతుకు ఈడ్వాల్సిన ఖర్మ మనకు లేదుకదా?"

ఎందుకో సావిత్రికేసి చూచాడు సుధాకర్. ముఖం తిప్పుకొందావిడ. బహుశః నవ్వు దాచుకోడానికేమో!

గమనించక పోలేదు హరనాధ్! 'ఏమిటో ఉంది సంగతి. సావిత్రి తిరస్కారానికి అర్థం బోధపడుతూనే ఉంది' అనుకొన్నాడు కొంచెం ఈర్ష్యగా.

## 7

ఆ రోజు రాత్రి అందరి భోజనాలూ అయిపోయాయి. కానీ, ఇంకా హర


# పన్నుల భారం తగ్గింది!

బ్యాంకులో డబ్బు దాచుకుంటే—

1. డిపాజిట్లమీద రాబడే వడ్డీ రు. 3,000ల వరకు పన్ను లేదు.
2. బ్యాంకులో ఉంచుకొన్న డిపాజిట్లమీద రు. 1,50,000ల వరకు ఆస్తి పన్ను లేదు.

మంచి వడ్డీ మీకు చేకూరుతుందిగూడా. సేవింగ్సు డిపాజిట్లమీద సంవత్సరమునకు 4% వడ్డీ, ఫిక్సెడ్ డిపాజిట్లమీద కాల పరిమితినిబట్టి సంవత్సరమునకు 7¼% వరకు కూడ వడ్డీ లభిస్తుంది. మత ధర్మ దేవాలయ వగైరా డిపాజిట్లకు ½% అధికంగా లభిస్తుంది ఈ సదవకాశాన్ని వినియోగించుకోండి.



కె. గోపాలరావు
ఛైర్మన్

యం.వి. సుబ్బారావు
జనరల్ మేనేజరు

దీ ఆంధ్ర బ్యాంక్ లిమిటెడ్
సెంట్రల్ ఆఫీసు: సుల్తాన్ బజార్,
హైదరాబాదు.

ఆంధ్ర ప్రదేశ్‌లో అత్యధిక బ్రాంచీలుగల బ్యాంకు

ODSAB1400TE AR

నాధ్ భోజనానికి రాలేదు. అందరిదీ అయిపోతే ఆఖరుదనగాని సావిత్రి భోజనం కాదు. వంట పాత్రలన్నీ ఒక ప్రక్కకు పెట్టి పొయ్యిలో బూడిద ఎత్తివేసి పేడ వేసి అలికి ముగ్గుకర్రకూడా వేసి చెయ్యి కడుక్కొంది. అప్పటికి కూడా హరనాధ్ క్రిందికి దిగే సూచనలు కనిపించలేదు.

ఈ మధ్య ఎంతో అవసరం పడితేగాని పైకి వెళ్ళడంలేదు సావిత్రి. ఇక తప్పనిసరై పైకి వెళ్ళింది. "భోజనానికి రారా?"

హరనాధ్ పక్కమీద పడుకున్నాడు. కళ్ళువిచ్చుకొని చూస్తూకూడా మాట్లాడలేదు.

"ఏం మాట్లాడరూ? భోజనం అక్కర్లేదా?"

"ఊహుం. ఆకలిగా లేదు"

"అయితే ఓ గ్లాసెడు పాలు తెస్తానుండండి. త్రాగి పడుకోండి"

సావిత్రి బలవంతం చేస్తే కొద్దిసేపు బెట్టుచేసి లేవాలనుకొన్నాడు. అర్మ! నిత్యంకంటే ఆకలి దహిస్తూంది బొజ్జలో "కాస్త ఆగు. ఒకమాట."

"పంచదార వేసి తేనా?"

"అదికాదు. ఇలా రా."

"చెప్పండి."

"నేనంటే అయిష్టంగా తిరుగుతున్నావెందుకు ఈ మధ్య?"

"అయితే. ఎప్పుడో ఇష్టంగా తిరిగానన్న మాటనా? మిమ్మల్ని ఒకటి ప్రార్థిస్తున్నాను, హరనాధ్ బాబూ! డబ్బున్నవాళ్ళ మాటకు బలం ఎక్కువ. సావిత్రి ఈ రాత్రి నన్ను పిలిచిందన్నా చప్పున నమ్మేస్తుంది ఈ లోకం. దయచేసి ఆలోచించుకొని మాట్లాడండి. ఈ పేదపిల్లమీద నీలాపనిందల భారం పడద్రోయకండి." ఆ మాటల్లో ప్రార్థనకంటే కటుదనమే ఎక్కువగా గుచ్చిందతడిని.


"ఎలా మాట్లాడినా మీ ఆడవాళ్ళకు చెల్లుతుంది, నే నన్నానా ఆ మాట?"

"అనకపోతే అంటారు. దాని దేం భాగ్యం?"

"ఛీ! ఎంతమాట? నువ్వలాంటిదానివి కాదు. నువ్వంటే నాకు గౌరవం లేదనుకొంటున్నావా, సావిత్రీ?"

"గౌరవ ముంటే ఉండనీయండి నేనిలా కొంచెం దూరంగా తిరగడమే క్షేమం. ఏమో ఈ ఇంటికోడల్ని కావాలని ఏ క్షణంలో దురాశపుట్టి మీమీదికి వల విసురుతానో తెలియదు." అంటూ క్రిందికి దూసుకుపోయింది సావిత్రి.

పాలు తీసుకొని వస్తుందని చాలాసేపు ఎదురుచూచాడు హరనాధ్. కాని రాలేదు. అతడే క్రిందికి వచ్చాడు. కళ్యాణికి కొంచెం దూరంలో పడుకొంది సావిత్రి. చప్పుడు కాకుండా వంటింట్లోకి వెళ్ళి




అన్నం గిన్నె అవీ చూచాడు. ఇద్దరికి సరి పడే అన్నం అనుపానాలు అందులో ఉండి పోయాయి.'

బోధపడని సావిత్రి అంతర్యం గురించే ఆలోచిస్తూ తిరిగి పైకి వచ్చేశాడు హరనాథ్. కాని ఒకటి తెలిసింది. సావిత్రి స్వాభిమానం చాలా గొప్పదని. చిన్న మాటకైనా లోతుగా నొచ్చుకుంటుందని!

◆ ◆ ◆

"సావిత్రక్కా! ఓ సావిత్రక్కా!"

ఉమ పిలుపువిని దొడ్లోంచి వచ్చింది సావిత్రి. ఆ పిల్ల ఏదో ఆకులతో చుట్టిన చుట్ట సావిత్రి చేతిలో పెట్టి. "అన్నయిచ్చాడు నీ కిమ్మని" అని చెప్పేసి పరిగెత్తి పోయింది.

పొట్లం విప్పితే జాజులూ. బొండు మల్లెలూ బయటపడ్డాయి. 'ఎవరు పెట్టుకోవాలని ఈ పూట!' ఉమకు పువ్వులు పెట్టడానికి రాదు! మొన్న మొన్నే ఆ పిల్ల పుట్టుజుట్టు ఇంటి దేవుడి దగ్గర ఇచ్చారు. ఇంకా జడకు పెరగలేదు. ఉమతల్లి భర్తకు అస్వస్థగా ఉన్నప్పుడు ఆమె సిగలో పూలు ముడుచుకొంటుందా? ఇహ పెట్టుకోవలసింది తనా? 'ఛీ! అతడు పువ్వులు తెస్తే నేను పెట్టుకోవడమేమిటి అసహ్యంగా?' సగం పువ్వులు తీసి పనిమనిషి రంగిచేతిలో పోసి, సగం పువ్వులు దేవుడిగదిలో దేవుడిమీద వెదజల్లింది.

రాత్రి భోజనం చేసి వెళ్ళబోతూ అటు ఇటు చూచి, మెల్లగా అడిగాడు హరనాథ్. "నేను తోటనుండి తెచ్చిన పూలు ఎవరూ పెట్టుకోనట్టుందే!"

"ఎవరు పెట్టుకొంటారు. అమ్మకు పూలమీద-శృంగారం మీద మనసు పోయే సమయం కాదు. ఉమకు జా ట్టులేదు"

"మరి, ను...వ్వు"

"నాకంతగా పువ్వుల మీద ఉండదు బుద్ధి."

"ఉఁ." దీర్ఘంగా మూలిగాడు. వెళ్ళిపోతూ అన్నాడు: "ఎలా మాట్లాడినా చెల్లుతుంది మీ ఆడవాళ్ళకు!"

"ఇదొక కొత్త పల్లవి నేర్చుకొన్నారేమిటమ్మా?' నవ్వుకొంది సావిత్రి.

* * *

హరనాధ్‌కు రోజులు నిరుత్సాహంగా తయారయ్యాయి. సేద్యంలో తను అడుగు పెట్టిన దుర్ముహూర్తమో, మరేమిటో గాని ఆకాశంలో కళ్ళప్పగించి కూర్చొ పెట్టియి పోయింది. వర్షపు చుక్కలేదు వేసవి ఎంతల్లా ఉండిపోతున్నాయి ఎండలు సాయంత్రం అవుతూనే నల్లని మబ్బులు కమ్ముకు వస్తాయి. చుక్క క్రింది రాల్చకుండా ఎటో పారిపోతాయి. నిర్దయగా రోహిణీ కార్తెలో పడిన విత్తనం జొన్నెడు ఎత్తుమొక్కలు పెరిగి వర్షబిందువుల కోసం అలమటిస్తున్నాయి.

సేద్యంలో అడుగు పెడుతూ చాలా కలలే కన్నాడు హరనాధ్. చదువుకొన్న వాడు వ్యవసాయం చేయిస్తే ఎలా ఆదర్శ ప్రాయంగా ఉంటుందో గ్రామసులకు చూపాలనుకొన్నాడు. దున్నడానికి వీలుగా ఉన్నది అంగుళం విడిచి పెట్టకుండా దున్నించాడు. రోహిణీ కార్తెలో విత్తనానికి బలమని విత్తనం వేయించాడు.... ఇప్పుడేమో నింగిలోకి చూస్తూ తపస్సు చేయవలసి వచ్చింది. అసలు ఏ ఆకర్షణ చేత ఇక్కడ ఆగిపోయాడో అదే చాలా నిరుత్సాహ జనకంగా తయారయింది. అది-సావిత్రి! బొత్తిగా అంటే ముట్టనట్టుగా తిరుగుతూంది ఆమె. 'సుధను ప్రేమిస్తున్నదేమో!' అనుకొంటే బాధగా ఉంది. తను నీలకాంత కథ చెప్పవలసింది కాదేమో అనుకొన్నాడు.

ఒక ఉదయం వేళ సావిత్రి హాలులోకి వచ్చింది, రావుగారిని స్నానానికి తీసుకుపోడానికి. వాకిట్లోకి ఓ మహిళల గుంపు వచ్చింది చప్పట్లు కొడుతూ. "గ్రక్కున రావయ్యో వానదేవో—ఓ వానదేవో .." అంటూ వరుణ దేవుడిని మొరలిడుతూ. చేటలో బియ్యం తీసుకు వచ్చిన సావిత్రి బియ్యం వెయ్యకుండా ఆగిపోయింది ... ఓ చేటలో ఏవో ఆకారం ఉండా కళ్ళు చెదరగొడుతూ ఎర్రగా ముదురు రంగులో మోదుగ పువ్వులు. మరొక పిల్ల చేతిలో కప్పను తలక్రిందులుగా చేసి కాళ్ళు కట్టిన కట్టు! 'ఛీ! ఏమిటది? కప్పను తల క్రిందుగా కట్టి వేళాడేసుకు వస్తే వర్షం వస్తుందా? ఇలాంటి పాపాలు నేల మీద ఎక్కువయ్యే వానదేవుడు బొట్టు రాల్చకుండా పారిపోతున్నాడు." బియ్యం తీసుకుని వెనుదిరిగింది.

(సశేషము)